మీ గతాన్ని ఒక్కసారి గుర్తుచేసుకోండి. గతంలో మీరు ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నారు, అవన్నీ సమసిపోయాయి.ఈ సమస్య కూడా తొలగిపోతుంది; దీనిని అధిగమించే శక్తి మీకు ఉంది. “ప్రతి సమస్యను ఒక సవాలుగా స్వీకరించండి. అప్పుడు మీ ముఖంపై చిరునవ్వును చెరిపివే యగలిగే శక్తి ఈ ప్రపంచంలో ఏదీ ఉండదు.”

- గురుదేవ్ శ్రీ శ్రీ రవి శంకర్ జీ




www.prajadeevena.com

# ప్రజా దీవెన

సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

నల్లగొండ | సంపుటి : 11 | సంచిక : 343 | బుధవారం | 14 అక్టోబర్ 2026 | పేజీలు : 04 వెల ₹5




## ఇకపై రాష్ట్రాలకు
# ఓట్ చోరీ సమరం

ఇండి కూటమి భేటీలో నిర్ణయం..

దేశవ్యాప్తంగా 5 రాష్ట్రాల్లో బహిరంగ సభలు

లక్ష్యాన్ని సాధించేదాకా పోరు: రాహుల్

దసరా తర్వాత హైదరాబాద్‌లో సభ

మీడియాతో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

25-26 తేదీల్లో సభ జరిగే చాన్స్!

4

ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం తాము చేస్తున్న పోరాటాన్ని.. ఒక తార్కిక ముగింపునకు వచ్చే వరకూ కొనసాగించాలని ఇండి కూటమి నిర్ణయించింది. ఓట్ చోరీకి వ్యతిరేకంగా ఇప్పటి వరకూ దేశ రాజధానిలో పలు నిరసన ప్రదర్శనలు నిర్వహించిన ఆ కూటమి.. తమ కార్యాచరణ ప్రణాళికను రాష్ట్రాలకు కూడా విస్తరించాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. మంగళవారం ఇక్కడ రాహుల్ గాంధీ నివాసంలో జరిగిన సమావేశంలో.. ఇండి కూటమి నేతలు, విద్యార్థి నాయకులు, పౌర సమాజానికి చెందిన నేతలు పాల్గొని, పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

## ఏదేమైనా ఎమ్మెల్సీ ఎన్నికల్లో
# జెండా ఎగరాలి
## అల్లాటప్పగా, తేలిగ్గా తీసుకోవద్దు

75 శాతం తెలంగాణను కవర్ చేసే కీలక పోరు

రాబోయే ఎమ్మెల్సీలు ఇతర సామాజిక వర్గాలకు

కేయూ విద్యార్థి నేతకు కార్పొరేషన్ పదవి

ప్రజాప్రతినిధులు, డీసీసీ చీఫ్‌లతో భేటీలో రేవంత్

హైదరాబాద్‌కు తిరిగొచ్చిన సీఎం, కాంగ్రెస్ నేతలు

రాజకీయాల్లో సెకండ్ ప్రైజ్ ఉండదు .. తేలికగా తీసుకోవద్దు.. గెలుపే లక్ష్యం కావాలి

సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పుట్టినిల్లు

రెండు సీట్లనూ రెడ్లకే ఇచ్చామనుకోవద్దు

మిగిలినవి ఇతర సామాజిక వర్గాలకు

ప్రజాప్రతినిధులు, డీసీసీ చీఫ్‌లతో భేటీలో సీఎం

**ప్రజా దీవెన, న్యూఢిల్లీ :** తెలంగాణలో త్వరలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలనూ కాంగ్రెస్ పార్టీయే గెలుచుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాజకీయాల్లో గెలుపే ప్రామాణికమని, ఇక్కడ సెకండ్ ప్రైజ్ ఉండదని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో నేతల పనితీరుపై ఆధారపడే భవిష్యత్తులో అవకాశాలు ఉంటాయని, నిర్లక్ష్యం వహిస్తే రాజకీయ జీవితం ముగిసినట్లేనని హెచ్చరించారు. ఢిల్లీ తుగ్లక్ రోడ్డులోని తన అధికారిక నివాసంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులతో రేవంత్‌రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దాదాపు గంటకుపైగా సాగిన ఈ సమావేశంలో ప్రధానంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. నాయకులు భేషజాలకు పోకుండా కలిసికట్టుగా పనిచేయాలని, ఎన్నికలను ఎట్టిపరిస్థితుల్లోనూ తేలికగా తీసుకోవద్దని

మిగతా 2 లో





## సింగరేణి కార్మికులకు
# దసరా ధమాకా

గరిష్ఠంగా రూ.లక్షన్నరకు పైగా.. కాంట్రాక్ట్ సిబ్బందికి 5,500 చొప్పున!

సంస్థ లాభాలు రూ.1754 కోట్లు

అందులో 34 శాతం..

596 కోట్లు కార్మికులకు బోన్‌సగా ఇస్తాం: డిప్యూటీ సీఎం భట్టి

సింగరేణిని భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్ ఇప్పుడు సాధించేందేంటి?: మంత్రి దుద్దిళ్ల

వివరాలు 2 లో

దసరా పండుగ సందర్భంగా సింగరేణి బొగ్గు గని కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఈ ఆర్థిక సంవత్సరంలో సింగరేణి ఆర్జించిన రూ. 1754 కోట్ల నికర లాభాల్లో 34 శాతం (అంటే రూ. 596 కోట్లను).. సంస్థలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు పండుగ బోన్‌సగా ఇస్తామని ప్రకటించింది.

## ‘మూసీ’లో ముందడుగు

టెండర్లు ఆహ్వానించిన ఎంఆర్‌డీసీఎల్

2 ప్యాకేజీల్లో పనులు చేపట్టేలా చర్యలు



# అన్నదాతలను ఆగంచేయొద్దు



3

జీవో 17తో అన్నదాతల మెడకు ఉరివేయొద్దు..

తక్షణమే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి..

లేకపోతే బీఆర్ఎస్ పక్షాన ఆందోళనలు చేస్తాం..

బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు హెచ్చరిక



2

# హైదరాబాద్ విజయవాడ హైవే విస్తరణకు మార్గం

కేంద్ర మంత్రి గడ్కరీ హామీ ఇచ్చారు..

ఎల్బీనగర్-హయత్‌నగర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ఆమోదం

నిర్మాణ శంకుస్థాపనకు కేంద్ర మంత్రి అంగీకారం

రాష్ట్ర అభివృద్ధిలో కీలకమైన రహదారుల విస్తరణ పనులను వేగవంతం చేస్తామని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చారని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు.

## రాహుల్ దిగజారుడుతనంతో
# రాద్ధాంతం



3

ప్రజలు ఓట్లేయకపోతే సీఈసీని, సీజేఐని బాధ్యులను చేస్తారా?

దేశ ప్రతిష్ఠను మంటగలిపేందుకు ఇండియా కూటమి ప్రయత్నం

రేవంత్‌రెడ్డి ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియడంలేదు

ఇక వారు శివతాండవం ఎలా చేస్తారు?: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

# ఏదేమైనా ఎమ్మెల్సీ ఎన్నికల్లో జెండా ఎగరాలి

మొదటి పేజీ తరువాయి

హెచ్చరించారు. ఈ ఎన్నికలు దాదాపు 75 శాతం తెలంగాణను కవర్ చేసే అత్యంత కీలకమైన పోరు అని పేర్కొన్నారు. ఎన్నికల బాధ్యతలను జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు సమన్వయంతో భుజానికెత్తుకోవాలన్నారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలను ఒకే సామాజిక వర్గానికి కేటాయించారంటూ విపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలని పార్టీ నేతలకు సూచించారు.

సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పుట్టినిల్లు అని చెప్పారు. గతంలో నామినేటెడ్ పదవులు, ఎమ్మెల్సీ స్థానాలు, పార్టీ పదవులు, కార్పొరేషన్ చైర్మన్ల భర్తీలో ఎంత పారదర్శకంగా వ్యవహరించామో, సామాజిక సమతుల్యతను ఏ విధంగా పాటించామో ప్రజలందరికీ తెలుసునని పేర్కొన్నారు. రాబోయే ఎమ్మెల్సీ స్థానాలను మిగిలిన సామాజిక వర్గాలకు కేటాయించి ఈ లోటును భర్తీచేస్తామన్నారు. కాకతీయ వర్సిటీ విద్యార్థి నేతకు కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇస్తామని ప్రకటించారు.



### దసరాలోపు కమిటీలు వేయాలి..

ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, దసరా పండుగలోపు గ్రౌండ్‌వర్క్ అంతా పూర్తిచేసి కమిటీలను నియమించాలని పార్టీ నేతలను సీఎం రేవంత్ ఆదేశించారు. మండల స్థాయిలో సమన్వయం కోసం ప్రత్యేక కమిటీలు వేయాలని, జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులతో కూడిన కమిటీ జిల్లా స్థాయి బాధ్యతలను పర్యవేక్షించాలని సూచించారు. కమిటీల్లో నియమించే ప్రతి సభ్యుడికీ తప్పనిసరిగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు హక్కు ఉండాలని స్పష్టం చేశారు. ఈ నెల 21, 23 తేదీల్లో రెండు ఎమ్మెల్సీ స్థానాలపై తాను సమీక్ష సమావేశాలు నిర్వహిస్తానని చెప్పారు. పీఆర్సీ ఏర్పాటు సహా ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చేసిన మేలును ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, మేధావులను భాగస్వాములను చేస్తూ ప్రచారాన్ని ముందుకు నడిపించాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 75 శాతం, మున్సిపాలిటీల్లో 80 శాతానికి పైగా స్థానాలు సాధించిన ఉత్సాహంతో ఈ రెండు ఎమ్మెల్సీల్లోనూ జయకేతనం ఎగరవేయాలని పిలుపునిచ్చారు.

### నేతలంతా తిరుగు ప్రయాణం

ఇండియా కూటమి ఆందోళనలో పాల్గొన్న తెలంగాణ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులను సీఎం రేవంత్ ప్రత్యేకంగా అభినందించారు. కొందరు నేతలు ఖర్గేను కలిశారు. నేతలు తమ తమ రాష్ట్రాలకు వెళ్లవలసిందిగా ఏఐసీసీ సూచించడంతో నేతలంతా రాష్ట్రానికి తిరుగు ప్రయాణమయ్యారు. సీఎం రేవంత్ సైతం హైదరాబాద్‌కు చేరుకున్నారు.

# హైదరాబాద్ విజయవాడ హైవే విస్తరణకు మార్గం

**కేంద్ర మంత్రి గడ్కరీ హామీ ఇచ్చారు..**

**ఎల్బీనగర్-హయత్‌నగర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ఆమోదం**

**శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌పై కొత్త డీపీఆర్‌కు ఆదేశాలు**

**రాష్ట్రానికి 5 రోప్ వేలు, 3 ఆర్వోబీలకు ఆమోదం**

**కృష్ణా నదిపై సోమశిల వద్ద ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి.. నిర్మాణ శంకుస్థాపనకు కేంద్ర మంత్రి అంగీకారం**

**రాష్ట్ర అభివృద్ధిలో కీలక ముందడుగు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** రాష్ట్ర అభివృద్ధిలో కీలకమైన రహదారుల విస్తరణ పనులను వేగవంతం చేస్తామని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చారని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. కేంద్రం దగ్గర పెండింగ్‌లో ఉన్న పలు కీలక రహదారులు, వంతెనలు, ఎలివేటెడ్ కారిడార్‌లు, రోప్‌వేలు సహా పనులను వేగవంతం చేయడంతో పాటు కొన్ని పనుల ప్రారంభించడం పట్ల గడ్కరీ సానుకూలంగా స్పందించారని చెప్పారు. మంగళవారం ఢిల్లీలో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి నితిన్ గడ్కరీతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి కార్యాలయం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేసింది. హైదరాబాద్-విజయవాడ (ఎన్‌హెచ్-65) రహదారి విస్తరణ పనులను జనవరిలో ప్రారంభిస్తామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు ప్రతిపాదించిన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే ప్రతిపాదన పట్ల కూడా కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ఎల్బీనగర్-హయత్‌నగర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ఆమోదం తెలిపారన్నారు. మన్ననూరు నుంచి పాతాళగంగ వరకు ప్రతిపాదించిన శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి కొత్త డీపీఆర్ రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారని వెల్లడించారు. పర్వతమాల పథకం కింద రాష్ట్రానికి 5 రోప్ వేలు, 3 ఆర్వోబీలను మంజూరు చేసేందుకు ఆమోదం తెలిపారన్నారు. కృష్ణా నదిపై సోమశిల దగ్గర ప్రతిపాదించిన ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనుల శంకుస్థాపనకు కేంద్ర మంత్రి అంగీకారం తెలిపారని వెల్లడించారు. ఈ వంతెన పూర్తయితే తిరుపతి వెళ్లేందుకు సుమారు 80కి.మీ దూరం తగ్గడంతో పాటు ప్రయాణ సమయమూ తగ్గుతుందని వివరించారు. సేతు బంధన్ పథకం కింద తెలంగాణలో మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ)ల నిర్మాణానికి కేంద్ర మంత్రి ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. వీటితో పాటు రాష్ట్రంలోని 34 రాష్ట్ర రహదారులను.. జాతీయ రహదారులుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కేంద్రమంత్రి ఆదేశించారని తెలిపారు. పుల్లూరు- అలంపూర్- జట్రపోలు- పెంటవెల్లి- కొల్లాపూర్- లింగాల -అచ్చంపేట- డిండి- దేవరకొండ- మల్లేపల్లి- నల్లగొండ రాష్ట్ర రోడ్లను జాతీయ రోడ్లుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరగా.. కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. ఇవన్నీ రాష్ట్ర అభివృద్ధిలో కీలక ముందడుగుగా నిలుస్తాయని అని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు. కాగా నవంబరు 19 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో నిర్వహించే ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్సీ) సదస్సుకు హాజరుకావాలని మంత్రి కోమటిరెడ్డి కేంద్ర మంత్రి గడ్కరీని ఆహ్వానించారు. ఈ సమావేశంలో ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, అధికారులు ఉన్నారు.

# ‘మూసీ’లో ముందడుగు

**టెండర్లు ఆహ్వానించిన ఎంఆర్‌డీసీఎల్**

**2 ప్యాకేజీల్లో పనులు చేపట్టేలా చర్యలు**



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** మూసీనది పునరుజ్జీవ ప్రాజెక్టుకు ముందడుగు పడింది. ప్రాజెక్టు మొదటి దశ పనులకు ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) నుంచి క్లియరెన్స్ వచ్చింది. దీంతో.. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో.. మొదటి దశలో 21 కిలోమీటర్ల మేర అభివృద్ధి పనులు రెండు ప్యాకేజీల్లో చేపట్టేందుకు టెండర్లను పిలిచారు. గురువారం నుంచి టెండర్ డాక్యుమెంట్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. టెండర్ దాఖలుకు తుదిగడువు నవంబరు 26. నవంబరు నెలాఖరుకల్లా.. అర్హత కలిగిన సంస్థలను ఎంపిక చేసే అవకాశాలున్నాయి. కాగా.. రెండు ప్యాకేజీల్లో భాగంగా మూసీనది ప్రక్షాళన, బఫర్ జోన్ సుందరీకరణ పనులను చేపట్టడంతోపాటు, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు. హిమాయత్ సాగర్ నుంచి బాపుఘాట్ వరకు గల ఈసా నదిపై 9.8కిలోమీటర్ల ప్రాంతాన్ని జోన్ -1ఏ కింద.. అలాగే గండిపేట నుంచి బాపుఘాట్ వరకు గల 11.2 కిలోమీటర్ల మూసీనది ప్రాంతాన్ని జోన్ 1బీ కింద అభివృద్ధి చేయనున్నారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టును వీ ఆకారంలో చేపట్టనున్నారు. మొదటి దశ పనులకు రూ.7,345 కోట్ల దాకా (ప్యాకేజీ-1 పనులకు రూ.3,232.01 కోట్లు, ప్యాకేజీ-2 పనులకు రూ.4,113.11 కోట్లు) ఖర్చవుతుందని అంచనా. జోన్ -1ఏ పనుల్లో భాగంగా.. నదిని శుభ్రం చేయడం, వరద నివారణ పనులు, రిటైనింగ్ గోడలు, రీవర్ ఎంబ్యాంక్‌మెంట్ల నిర్మాణం, రోడ్లు, బ్రిడ్జిలు, యుటిలిటీ కారిడార్, వర్షపునీటి డ్రైనేజీ, సీడీ పనులు, ట్రంక్ సీవర్ మెయిన్ లైన్లు, రబ్బర్ డ్యామ్స్ పనులు చేపట్టడంతో పాటు ఐదేళ్ల పాటు ఆపరేషనల్ మెయింటెనెన్స్ నిమిత్తం టెండర్లను ఆహ్వానించారు. జోన్ 1బీలో.. ప్యాకేజీ-1 మాదిరిగా పనులు చేపట్టడంతో పాటు ఐదేళ్లపాటు ఆపరేషనల్ మెయింటెనెన్స్ బాధ్యతలు నిర్వహించాలి. అదనంగా ఔటర్‌పై ఐకానిక్ కేబుల్ స్టేడ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

# దశాబ్దాలుగా ఓడుతున్న.. కాంగ్రెస్‌కు మళ్లీ దడబిడే

**ఢిల్లీలో నిరసనలతో దేశ ప్రజలందరి గొంతుక వినిపించినట్లు కాదు**

**సర్ వచ్చింది 2024లో.. కాంగ్రెస్ దశాబ్దాలుగా ఓడుతూ వస్తోంది**

**2029లోనూ ఘోర ఓటమే: అమిత్ షా**

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ పార్టీకి గ్రామాల్లో పట్టు లేదని, 2029 ఎన్నికల్లోనూ ఘోర పరాజయం తప్పదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. ఎన్నికల ప్రక్రియలను విమర్శించడం మాని, కాంగ్రెస్ పార్టీ తన వైఫల్యాలపై ఆత్మ పరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. సర్‌లో అక్రమాలు జరిగాయని, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో.. ఇండియా కూటమి నేతలతో కలసి కొన్ని రోజులుగా రాహుల్ గాంధీ ఢిల్లీలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతెలిసిందే. దీంతో మంగళవారం అమిత్‌షా ఢిల్లీలో విలేకరులతో మాట్లాడిన సందర్భంగా, రాహుల్ వ్యవహార శైలిపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి గ్రామాల్లో ఉనికే లేదన్నారు. ప్రతిపక్ష నేతలను, కార్యకర్తలను సమీకరించి ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కు వ్యతిరేకంగా ఢిల్లీలో నిరసనలు నిర్వహించినంత మాత్రాన దేశ ప్రజలందరి గొంతుక వినిపించినట్లు కాదన్నారు. దేశ ప్రజల గొంతుక అన్నది పొలాలు, పల్లెలు, కొండలు, అడవులు, నదీ తీరాల్లోనూ వినిపిస్తుందంటూ.. ఆ ప్రాంతాల్లో కాంగ్రెస్ ఉనికి నామమాత్రమేనని, దాదాపు లేనేలేదన్న విషయాన్ని ఆ పార్టీ అర్థం చేసుకోవాలన్నారు. సర్ 2024లోనే అమల్లోకి వచ్చిందని.. కానీ, కాంగ్రెస్ పార్టీ అంతకుముందు నుంచే వరుసగా ఎన్నికల్లో ఓటమి పాలవుతూ వచ్చిందని గుర్తు చేశారు. 2029 ఎన్నికల్లోనూ కాంగట్రెస్‌కు ఘోర పరాజయం తప్పదన్నారు. వరుసగా నాలుగో విడత లోక్‌సభ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోనుందని జోస్యం చెప్పారు. గుజరాత్‌లో తాజాగా జరిగిన మూడు పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ 104కు గాను 90 చోట్ల విజయం సాధించిన అనంతరం అమిత్‌షా ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. గాంధీనగర్‌లో బీజేపీ ఓటు శాతం క్రితం ఎన్నికలతో పోలిస్తే 10 శాతం పెరిగినట్లు అమిత్‌షా చెప్పారు. ఈ ఫలితాలను ప్రధాని మోదీకి లభిస్తున్న నిరంతర ప్రజా మద్దతుకు నిదర్శనంగా పేర్కొన్నారు. 1985 నుంచి గుజరాత్‌లో కాంగ్రెస్ ఒక్క ఎన్నికల్లోనూ గెలవలేదని అమిత్‌షా గుర్తు చేశారు. త్రిపురలోనూ గత 33 ఏళ్లుగా కాంగట్రెస్‌కు ముఖ్యమంత్రి ఎవరూ లేరన్నారు. అలాగే, బెంగాల్లోనూ 54 ఏళ్ల నుంచి ఒక్క ఎన్నికల్లోనూ కాంగ్రెస్ గెలవలేదన్న గణాంకాలను షా ఉదహరించారు. ఇక రాహుల్ నిర్వహిస్తున్న ‘ఛాత్రోన్‌కీ గూంజ్’ (విద్యార్థుల ప్రతిధ్వని) కార్యక్రమాన్ని అబద్ధాల ప్రతిధ్వనిగా అమిత్‌షా అభివర్ణించారు.

# కేంద్ర మంత్రి మురుగన్ రాజీనామా

**మంత్రి పదవితోపాటు రాజ్యసభ సభ్యత్వానికి కూడా..**

**బాధ్యతల నుంచి విముక్తం చేయాలంటూ ప్రధానికి లేఖ**

**పార్టీకి పూర్తి సమయం కేటాయించేందుకేనని వివరణ**

**తమిళనాట బీజేపీ బలోపేతానికి పనిచేస్తానని ప్రకటన**

**చెన్నై :** కేంద్ర సమాచార, ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాలశాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ మంత్రి పదవికి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మంగళవారం ఈ మేరకు ఆయన లేఖను పంపించారు. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందు తమిళనాడులో బీజేపీని బలోపేతం చేసేందుకు తాను తిరిగి క్షేత్రస్థాయికి వెళ్లి, పూర్తి సమయాన్ని కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. తక్షణమే తనను ఆయా బాధ్యతల నుంచి విముక్తం చేయాలని అభ్యర్థించారు. తన రాజీనామా గురించి ‘ఎక్స్’లోనూ ఆయన ప్రకటించారు. ప్రధాని మోదీ నేతృత్వంలో భారతమాతకు, తమిళనాడుకు సేవ చేయడం తన జీవితంలో అత్యంత గొప్ప విషయమని పేర్కొన్నారు. రోజువారీ కూలీల కుమారుడిగా మొదలై, కేంద్రమంత్రివర్గంలో పనిచేసే స్థాయికి చేరడం తన అదృష్టమన్నారు. ‘దేశం ప్రథమం, ఆ తర్వాత పార్టీ, చివరన స్వప్రయోజనం’ అని తెలిపారు. తమిళనాడులోని నామక్కల్ జిల్లా కొనూరులో జన్మించిన డాక్టర్ లోగనాధన్ మురుగన్ తెలుగు మాట్లాడే అరుంధతియార్ సామాజిక వర్గానికి చెందినవారు. 1977లో జన్మించిన ఆయన.. చెన్నైలోని డాక్టర్ అంబేద్కర్ లా కళాశాల నుంచి డిగ్రీ, మద్రాస్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఆ సమయంలో ఏబీవీపీలో చేరి తర్వాత ఆర్‌ఎస్‌ఎస్ వైపు ఆకర్షితులయ్యారు. అనంతరం బీజేపీలో చేరి క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చారు. 2011 అసెంబ్లీ ఎన్నికల్లో రాశిపురం నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున పోటీ చేసి 1800 ఓట్లు మాత్రమే సంపాదించుకోగలిగారు. ఆ తర్వాత బీజేపీలో వివిధ హోదాల్లో క్రియాశీలకంగా వ్యవహరించి 2020లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులయ్యారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో తారాపురం నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. అయితే, అధ్యక్షుడిగా కిందిస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంలో ఆయన సఫలీకృతమయ్యారు. దీనిని గుర్తించిన పార్టీ అధిష్ఠానం ఆయన్ని కేంద్రమంత్రివర్గంలోకి తీసుకుంది. తమ పార్టీ తరఫున గెలిచిన ఐదుగురు ఎమ్మెల్యేలను అధిష్ఠానానికి పరిచయం చేసేందుకు 2021 జూలై 7వ తేదీన ఢిల్లీకి తీసుకెళ్లిన ఆయనకు కేంద్రమంత్రి పదవి ఇచ్చి సత్కరించింది. అలాగే మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు పంపించింది. రాజ్యసభ సభ్యుడిగా ఆయన పదవీకాలం 2030 వరకు ఉంది. త్వరలో కేంద్రమంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరుగనున్నట్లు ప్రచారం జరుగుతున్న తరుణంలో మురుగన్ రాజీనామా చేయడం గమనార్హం.

# పరువు నష్టం దావాపై రాహుల్‌కు ఊరట

**న్యూఢిల్లీ :** ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మంగళవారం సుప్రీంకోర్టులో ఊరట లభించింది. మహారాష్ట్రలో నమోదైన పరువు నష్టం దావాలో విచారణపై స్టే విధిస్తూ ఆదేశాలు ఇచ్చింది. 2018లో రాజస్థాన్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీపై పరువుకు నష్టం కలిగించేలా విమర్శలు చేశారంటూ శ్రీశ్రీమల్ అనే బీజే పీ కార్యకర్త ఈ దావా వేశారు. విచారణకు రావాలంటూ గిరిగాం మేజిస్ట్రేటు సమన్లు జారీ చేయగా దాన్ని సవాలు చేస్తూ రాహుల్ తొలుత బాంబే హైకోర్టును ఆశ్రయించారు. సమన్ల కొట్టివేతకు హైకోర్టు నిరాకరించడంతో సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. సానుకూలంగా స్పందించిన ధర్మాసనం విచారణపై స్టే ఇచ్చింది. దీనిపై నాలుగు వారాల్లో సమాధానం ఇవ్వాలంటూ పిటిషనర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు పంపించింది.

# దీపావళి వరకు ‘యూపీఐ’ ఉచితం!

**ఆ తర్వాతే అమల్లోకి ఎండీఆర్ చార్జీలు**

**న్యూఢిల్లీ :** దసరా, దీపావళి పండుగల ముందు వ్యాపారులు, వినియోగదారులకు పెద్ద ఊరట లభించింది. మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎండీఆర్)ను అక్టోబర్ 15కు బదులు, దీపావళి తర్వాత నుంచి అమలు చేస్తామని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) మంగళవారం ప్రకటించింది. “పండుగల సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని ఎంపిక చేసిన పర్సన్ టు మర్చంట్ (పీ2ఎం/వ్యక్తులు వర్తకులకు చేసే చెల్లింపులు) లావాదేవీలపై ఎండీఆర్‌ను దీపావళి ముగిసిన వెంటనే అమలు చేయాలని ‘యూపీఐ అండ్ సర్వీసెస్ స్టీరింగ్ కమిటీ’ నిర్ణయించింది. ఏ తేదీ నుంచి అన్నది తర్వాత నోటిఫై చేస్తాం”అని ఎన్‌పీసీఐ ప్రకటించింది. ముందు ప్రకటించినట్లుగా అయితే ఈ నెల 15 నుంచే ఎండీఆర్ (ఛార్జీలు) ఛార్జీలు అమల్లోకి రావాల్సి ఉంది. ఏటా దసరా-దీపావళి సమయంలోనే ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లోనూ (స్టోర్లలో) భారీ విక్రయాలు జరుగుతుంటాయి. ఇలాంటి కీలక తరుణంలో ఎండీఆర్ అమలుతో తమపై భారం పడుతుందని వర్తకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆందోళనలను, ఎండీఆర్ అమలులో సవాళ్లను యూపీఐ స్టీరింగ్ కమిటీ పరిగణనలోకి తీసుకుంది. వ్యక్తులు వర్తకులకు రూ.2,000 మించి చేసే చెల్లింపులపై 0.4శాతం ఎండీఆర్ అమలు చేయాలని ఎన్‌పీసీఐ ఇటీవల నిర్ణయించడం తెలిసిందే. రూ.2,000లోపు చెల్లింపులపై ఎలాంటి ఛార్జీల్లేవు. రైల్వే సేవలు, టెలికం బిల్లులు, ఇన్సూరెన్స్ ప్రీమియం, ఇంధన, యుటిలిటీ, విద్యా సంబంధిత చెల్లింపులపై (రూ.2,000కు మించి) కేవలం రూ.5 ఛార్జీని నిర్ణయించారు.

# సింగరేణి కార్మికులకు దసరా ధమాకా

## గరిష్ఠంగా రూ.లక్షన్నరకు పైగా.. కాంట్రాక్ట్ సిబ్బందికి 5,500 చొప్పున! సంస్థ లాభాలు రూ.1754 కోట్లు

### అందులో 34 శాతం.. 596 కోట్లు కార్మికులకు బోనస్‌గా ఇస్తాం: డిప్యూటీ సీఎం భట్టి

### సింగరేణిని భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్ ఇప్పుడు సాధించేందేంటి?: మంత్రి దుద్దిళ్ల



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** దసరా పండుగ సందర్భంగా సింగరేణి బొగ్గు గని కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఈ ఆర్థిక సంవత్సరంలో సింగరేణి ఆర్జించిన రూ.1754 కోట్ల నికర లాభాల్లో 34 శాతం (అంటే రూ. 596 కోట్లను).. సంస్థలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు పండుగ బోనస్‌గా ఇస్తామని ప్రకటించింది. ఈ నిర్ణయంతో కార్మికులకు గరిష్ఠంగా రూ.1,53,912 మేర బోనస్‌గా అందనుందని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మంగళవారం ప్రజాభవన్‌లో మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ నిర్ణయంతో సింగరేణిలోని 38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులు, కార్మికులకు ప్రయోజనం కలగనుందని చెప్పారు. అలాగే.. 29,717 మంది కాంట్రాక్టు కార్మికులకు కూడా ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున దసరా బోనస్ చెల్లించనున్నట్లు ఆయన వెల్లడించారు. సింగరేణి ఉద్యోగులు, కార్మికుల సొంతింటి కలను సాకారం చేయడానికి వీలుగా ఇప్పటి వరకూ మైనింగ్ చేపట్టని ప్రాంతాలను గుర్తించి, అక్కడ ఇళ్ల నిర్మాణానికి అనువుగా లే-అవుట్లు సిద్ధం చేసి, జవహర్ లాల్ నెహ్రూ పేరిట హౌసింగ్ కాలనీ ఏర్పాటుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు భట్టి సూచించారు. సింగరేణి నుంచి రెవెన్యూ శాఖకు అప్పగించిన భూముల్లో దాదాపు 1250 ఎకరాల్లో.. అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించినట్టు తెలిపారు. సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న సుమారు 250 నుంచి 300 డిపెండెంట్ ఆర్డర్లు, ఇతర చట్టపరమైన ప్రక్రియలను 15 రోజుల్లో పూర్తి చేసి అరు?లైన అభ్యర్థులకు ఉత్తర్వులు అందజేయాలని ఆదేశించినట్టు చెప్పారు. పేర్ల మార్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను మానవీయ కోణంలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించామని తెలిపారు. మెడికల్ ఇన్వాలిడేషన్ కోసం కార్మికులు కొత్తగూడెం వరకూ వెళ్లాల్సిన అవసరం లేకుండా సింగరేణి పరిధిలోని అన్ని ఏరియా ఆసుపత్రుల్లో ప్రతి నెలా ఒకరోజు మెడికల్ బోర్డు సమావేశాలు నిర్వహించాల్సిందిగా ఆదేశించినట్టు చెప్పారు. సింగరేణి ఉద్యోగులకు చెల్లిస్తున్నట్టే కార్మికుల పెర్క్స్, అలవెన్స్‌లపై ఆదాయపన్నును కూడా సంస్థ తరఫున ప్రభుత్వానికి చెల్లించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించామన్నారు.

### ప్రతి గ్రామంలో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు

బొగ్గు గనులు, ఓవర్ బర్డెన్ డంప్‌ల దుమ్ము వల్ల ప్రజల ఆరోగ్యం ప్రభావితమవుతున్న నేపథ్యంలో.. సింగరేణి పరిధిలోని పాత జిల్లాల్లో ప్రతి గ్రామంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని భట్టి తెలిపారు. గత పదేళ్లలో కొత్త బొగ్గు బ్లాక్‌లను అదనంగా సాధించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కాగా.. దాదాపు పదేళ్ల పాటు అధికారంలో ఉండి సింగరేణిని నిర్వీర్యం చేసి, భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు పోరుబాట పేరుతో ఆందోళనలకు పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందని ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఎద్దేవా చేశారు.

# అన్నదాతలను ఆగంచేయొద్దు

## జీవో 17తో అన్నదాతల మెడకు ఉరివేయొద్దు..

## తక్షణమే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి..

## లేకపోతే బీఆర్ఎస్ పక్షాన ఆందోళనలు చేస్తాం..

## బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు హెచ్చరిక



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** రైతు డిస్కమ్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలకు ఉచిత విద్యుత్తును దూరం చేసేందుకు కుట్ర పన్నుతున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూ టీ ఫ్లోర్‌లీడర్ టీ హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్‌తోపాటు విద్యుత్తురంగ నిపుణులు, ఉద్యోగ సంఘాలు, రైతు లు లేవనెత్తుతున్న అభ్యంతరాలను పట్టించుకోకుండా రైతు డిస్కమ్‌ను ఏర్పా టు చేస్తూ జీవో 17 జారీ చేయడాన్ని మంగళవారం 'ఎక్స్' వేదికగా ఆయన ఖండించారు. రైతు మెడకు ఉరివేసే విధానాలను, జీవోను తక్షణమే ఉపసంహరించుకోకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

### నిర్వహణ లేక రైతులకు ఇబ్బందులు

కొత్తగా తెచ్చిన జీవో ప్రకారం 30.60 లక్షల వ్యవసాయ కనెక్షన్లు, 512 లిఫ్ట్ ఇరిగేషన్ సీములు, మిషన్ భగీరథ, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ పరిధిలోనివి కలిపి మొ త్తం 30,62,853 కనెక్షన్లను రైతు డిసమ్ కు బదిలీ చేశారని హరీశ్ తెలిపారు. 6.15 లక్షల వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు, 2.51 లక్షల సర్క్యూట్ కిలోమీటర్ల ఎల్‌టీ లైన్లతో కూడిన ఇంతటి భారీ వ్యవస్థను కేవలం 2వేల మంది సిబ్బందితో ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే మార్చే వారు కరువయ్యారని, రేపు తీవ్ర ఇబ్బందులు వస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు. రాష్ట్ర విద్యుత్తు లభ్యతలో 53.28 శాతం థర్మల్ విద్యుత్తు ఉంటే, రైతు డిసమ్‌కు 25 శాతం థర్మల్ విద్యుత్తును మాత్రమే కేటాయించారని చెప్పారు. పగటిపూట మాత్రమే లభించే సోలార్ వి ద్యుత్తును 58శాతం, ఏడాదిలో కేవలం 3-4 నెలలు మాత్రమే ఉత్పత్తయ్యే హైడల్ వి ద్యుత్తును 100శాతం కేటాయించడం వెను క ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. మిగతా ఎనిమిది నెలలపాటు కరెంట్ ఎలా ఇస్తారని, రైతులను చీకట్లోకి నెట్టేందుకే ఈ నిర్ణ యం తీసుకున్నారా? అని నిలదీశారు.

### పీఎంయూ టెండర్లు రద్దు చేయండి

గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో నిత్యావసర సరుకుల సరఫరా కోసం తెచ్చిన కేంద్రీకృత పీఎంయూ టెండర్లను తక్షణమే రద్దు చేయాలని హరీశ్ డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ గురుకుల కాం ట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు హరీశ్‌ను ఆయన నివాసంలో కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. కొత్త విధానం వల్ల వేలాది స్థానిక చిరు వ్యాపార కుటుంబాలు రోడ్డున పడే దుస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన హరీశ్‌రావు.. నోట్ బుకుల కొనుగోళ్లలో రూ.2వేల కోట్ల భారీ కుంభకోణం జరిగిందని, ఇప్పుడు నిత్యావసరాలపై కూ డా 20శాతం మేర కమీషన్లు దండుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు.

# కాంగ్రెస్‌ను ఈసీ గెలిపించాలా?

## ప్రజలు ఓట్లేయకపోతే సీఈసీని, సీజేఐని బాధ్యులను చేస్తారా?

## ఢిల్లీలో కాంగ్రెస్ డ్రామాలను ప్రజలు అసహ్యించుకుంటున్నారు

## దేశ ప్రతిష్ఠను మంటగలిపేందుకు ఇండియా కూటమి ప్రయత్నం

## రాహుల్‌గాంధీ తన స్థాయిని మరిచి దిగజారి వ్యవహరిస్తున్నారు

## రేవంత్‌రెడ్డి ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియడంలేదు

## కాంగ్రెస్ డీఎన్ఏలోనే శివుడు, రాముడి ప్రస్తావన లేదు

## ఇక వారు శివతాండవం ఎలా చేస్తారు?: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**న్యూఢిల్లీ, అక్టోబరు 13 :** కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజల మద్దతు పొందలేక, ఎన్నికల్లో గెలవలేక.. ఎన్నికల కమిషన్‌పై నిందలు వేస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆ పార్టీకి ప్రజలు ఓటేయకపోతే ఎన్నికల కమిషన్, సుప్రీంకోర్టు బాధ్యత వహించాలా? ఎన్నికల కమిషనర్ కాంగ్రెస్‌ను గెలిపించాలా? అని ప్రశ్నించారు. గత వారం రోజులుగా కాంగ్రెస్, ఆ పార్టీ మిత్రపక్షాలు ఢిల్లీలో నిరసనల పేరిట చేస్తున్న డ్రామాలను దేశ ప్రజలు అసహ్యించుకుంటున్నారని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను దేశంలో అరాచకం సృష్టించేందుకు కాంగ్రెస్, కమ్యూనిస్టులు, ఇతర ప్రతిపక్షాలు దుర్వినియోగం చేస్తున్నాయని ఆరోపించారు. దేశ చరిత్రలో ఇంతవరకు రాజకీయ పార్టీలేవీ వేలాది మందితో సుప్రీంకోర్టుకు ఊరేగింపుగా వెళ్లి ప్రధాన న్యాయమూర్తిపై, న్యాయమూర్తులపై ఒత్తిడి తేవడం, బెదిరించే ప్రయత్నం చేయడం జరగలేదన్నారు. మంగళవారం ఢిల్లీలోని తన నివాసంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తమకు అనుకూలంగా తీర్పులు రానందున సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కూడా గద్దె దిగాలని కాంగ్రెస్ అంటోందని మండిపడ్డారు. దేశం ఏమైనా సోనియా ఫ్యామిలీ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాపర్టీయా? అని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ తన స్థాయిని మరిచి దిగజారి వ్యవహరిస్తున్నారని, వ్యవస్థలను ఛిన్నాభిన్నం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీని నామరూపాల్లేకుండా చేయాలని ఆయన కంకణం కట్టుకున్నారని ఎద్దేవా చేశారు.

### దేశంలో కాంగ్రెస్ రాచరికం నడవదు..

మోదీ సర్కారును గద్దె దించాలని ప్రతిపక్షమైన కాంగ్రెస్ భావించడంలో తప్పులేదని, కానీ.. దాని కోసం రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేసేలా వ్యవహరించడం దారుణమని కిషన్‌రెడ్డి అన్నారు. దేశంలో కాంగ్రెస్ రాచరికం సాగదని, రాహుల్‌గాంధీ, విదేశీ శక్తులు చెప్పినట్టు దేశంలో వ్యవస్థలు నడవవని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్‌లో ఓట్ల తొలగింపులో తప్పులుంటే.. గుర్తించి, సరిదిద్దాల్సిన బాధ్యత అందరిదని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రతి పోలింగ్ బూత్ వారీగా కాంగట్రెకు బీఎల్ఏలు ఉన్నారని గుర్తుచేశారు. సర్ ద్వారా దేశంలో 2.8 కోట్ల మంది ఓటర్లు చనిపోయినట్లు తేలిందని, వారి ఓట్లను ఉంచితే ఎవరు వచ్చి ఓటు వేస్తారని ప్రశ్నించారు. 6.3 కోట్ల మంది వేరే ప్రాంతాలకు వెళ్లిపోయారని, వారు ఉంటున్న ప్రాంతంలోనే వారికి ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉందని అన్నారు. మరో కోటి మందికి రెండు చోట్ల ఓట్లున్నాయని, 3 కోట్ల మంది ఓటర్లు ఎక్కడ ఉన్నారో కూడా తెలియదని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ శివతాండవం అంటున్నారని, అసలు కాంగ్రెస్ డీఎన్ఏలోనే రాముడు, శివుడి గురించి లేదని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియడం లేదని కిషన్‌రెడ్డి విమర్శించారు. "పేదల, ఆదివాసీల, దళితుల, మైనారిటీల ఓట్లు తీసేస్తున్నారంటూ రేవంత్ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తెలంగాణలో బీజేపీ ధర్నా చేయాలని చూస్తే రేవంత్ ప్రభుత్వం ముందస్తు అరెస్టులు చేస్తోంది. ఢిల్లీలో మాత్రం ధర్నాలు చేస్తూ.. ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని మాట్లాడుతున్నారు. తెలంగాణలో ఒక నీతి.. ఢిల్లీలో మరో నీతా?" అని ధ్వజమెత్తారు. తెలంగాణలో రైతులు నీళు లేక, పరిశ్రమలు, ప్రజలు కరెంట్ కోతలతో ఇబ్బందులు పడుతుంటే.. సీఎం రేవంత్‌రెడ్డి వారానికోసారి ఢిల్లీకి వచ్చి రాహుల్‌గాంధీని పొగిడి వెళ్తున్నారని విమర్శించారు.

# నేడు సింగరేణి గర్జన

## గోదావరిఖనిలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ

## హాజరుకానున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## కాంగ్రెస్ మోసాలపై కదం తొక్కనున్న కార్మికులు

**గోదావరిఖని, అక్టోబర్ 13:** అధికారంకోసం హామీలిచ్చి గద్దెనెక్కగానే మొండిచెయ్యి చూపిన కాంగ్రెస్‌పై కదంతొక్కేందుకు సింగరేణి కార్మికలోకం సిద్ధమవుతున్నది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే 'సింగరేణి కార్మిక గర్జన' భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తికాగా పెద్ద సంఖ్యలో తరలివచ్చేందుకు నల్ల సూర్యులు ఉత్సాహంగా ఉన్నారు. దాదాపు 30 వేల మంది పాల్గొంటారని భావిస్తున్న సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. రెండు రోజులుగా బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు సభ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించి దగ్గరుండి పనులు పర్యవేక్షించారు. టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షుడు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ మంత్రి గంగుల కమలాకర్, ప్రభుత్వ మాజీ విప్ బాల్క సుమన్, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీశ్‌రెడ్డి, కౌశిక హరి, కోలేటి దామోదర్, మూల విజయారెడ్డి సభ విజయవంతం కోసం విశేషంగా కృషి చేస్తున్నారు. సభకు రామగుండం, మంథని నియోజకవర్గాలతోపాటు మంచిర్యాల జిల్లాలోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు తరలిరానున్నారు.

### 6,324 కోట్లు ఏమైనయ్? : కొప్పుల

' కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పేరిట రెండేండ్లుగా సింగరేణి లాభాల్లోంచి పక్కన పెట్టిన రూ.రూ.6,324 కోట్లు ఏమైనయి? ఎక్కడ ఖర్చుపెట్టారో చెప్పాలి' అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించారు. మంగళవారం గోదావరిఖనిలోని సింగరేణి స్టేడియంలో సభ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. కార్మికుల జీతాలు, సంక్షేమం కోసం ప్రతి నెలా రూ.4 వేల కోట్లు ఓడీ రూపంలో తెస్తున్నామని చెప్తు న్న ప్రభుత్వం, ఇంత పెద్ద మొత్తంలో నిల్వ లు ఉన్నా మళ్లీ ఓడీలు ఎందుకు తేవాల్సి వస్తున్నదని నిలదీశారు. ఇది కార్మికులను మోసం చేసే పెద్ద స్కామ్ అని, దీనిపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేసి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బుధవారం సింగరేణి కార్మిక గర్జన నిర్వహిస్తున్నందునే ప్రభుత్వం దిగివచ్చి కేటీఆర్ సభకు ముందే మంగళవారం లాభాల వాటాను ప్రకటించిందని చెప్పారు.

### సింగరేణిని భ్రష్టు పట్టించిండ్రు : బాల్క సుమన్




కాంగ్రెస్ సర్కార్ సింగరేణి సంస్థను భ్రష్టుపట్టించిందని ప్రభుత్వ మాజీ విప్ బాల్క సుమన్ విమర్శించారు. సోలార్ ప్లాంట్లు, డీజిల్, పెట్రోల్ కొనుగోళ్లు, ఓబీ వర్క్ టెండర్లు, ఎక్స్‌ప్లోజివ్‌ల కొనుగోళ్లలో విపరీతమైన కుంభకోణాలకు పాల్పడుతూ కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయకుండా కార్మికులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్, టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని చెప్పారు.

# భద్రతా ఫీచర్ల పేపర్‌తో కొత్త 'మీ-సేవ' సర్టిఫికెట్

## మన్నికతోపాటు 15 అత్యాధునిక భద్రతా ఫీచర్లు

## ప్రజాభవన్‌లో ప్రారంభించిన ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** 'మీ- సేవ' సర్టిఫికెట్లను జారీ చేయడానికి 15 అత్యాధునిక భద్రతా ఫీచర్లతో కూడిన సెక్యూరిటీ పేపర్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. తద్వారా నకిలీ సర్టిఫికెట్లు, అనధికారిక నకళ్లను అరికట్టేందుకు వీలవుతుంది. దీన్ని నీళ్లలో పడి తడిసినా చెడిపోకుండా, దెబ్బ తినకుండా రూపొందించారు. ప్రజా భవన్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో కొత్త సెక్యూరిటీ పేపర్‌తో 'మీ-సేవ' సర్టిఫికెట్ విధానాన్ని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఈ విధానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. జనన, మరణ ధ్రువపత్రాలతోపాటు విద్య, ఉద్యోగ అవకాశాలు, తదితర అవసరాలకోసం వినియోగించే సర్టిఫికెట్లు ప్రజల జీవితంలో ఎంతో ముఖ్యమైనవని, వాటిలో కొన్నింటిని జీవితాంతం భద్ర పరుచుకోవాల్సి ఉంటుందన్నారు. అటువంటి ధ్రువపత్రాలు త్వరగా పాడవకుండా చూడటంతోపాటు వాటి విశ్వసనీయత పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.

# భాగ్యనగరంలో కొత్త ఓటర్లు

## ఓటర్ నమోదుకు 2.18 లక్షల దరఖాస్తులు

## వాటిల్లో 70 వేలు ఆమోదం, 14,267 తిరస్కరణ

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** హైదరాబాద్‌లో మరో 70 వేల మంది ఓటర్లుగా నమోదయ్యారు. ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా 70 వేల ఫారం-6 దరఖాస్తులను అధికారులు ఆమోదించారు. ఈ ప్రక్రియలో భాగంగా ఓటరు నమోదుకు మొత్తం 2.18 లక్షల ఫారం-6 దరఖాస్తులు జీహెచ్ఎంసీకి అందాయి. ఇందులో అత్యధికంగా బహదూర్‌పురా నియోజకవర్గం నుంచి 33,026, అత్యల్పంగా సనత్‌నగర్‌లో 5,781 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం దరఖాస్తుల్లో 70వేలు ఆమోదం పొందగా, 1.33 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. 14,267 దరఖాస్తులను తిరస్కరించారు. ప్రవాస భారతీయ ఓటర్లకు సంబంధించి 4,589 దరఖాస్తులు రాగా 529 అమోదించారు. ఇక, చిరునామా మార్పు/సవరణ కోసం 1.62 లక్షల దరఖాస్తులు వచ్చాయని, వాటిల్లో 1.19 లక్షలు ఆమోదించామని, 17,986 దరఖాస్తులను తిరస్కరించామని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ వివరించారు. ముసాయిదా జాబితా ప్రకారం 27.95 లక్షల మంది ఓటర్లు ఉండగా.. ఇందులో 12.54 లక్షల మందికి నో మ్యాపింగ్, ఎనామలిస్ పేరిట నోటీసులిచ్చారు. వీరిలో 11.01 లక్షల మంది విచారణ (హియరింగ్)కు హాజరైనట్టు తెలిపారు. 1.39 లక్షల ఓటర్ల విచారణ పెండింగ్‌లో ఉందన్నారు. సర్ షెడ్యూల్ ప్రకారం ఓటరు తుది జాబితా నవంబరు 9న ప్రకటించనున్నారు.

# ప్రజాస్వామ్యానికి భారత్ మాతృభూమి!

## ప్రభుత్వం తన అధికారాన్ని ఎలా వినియోగిస్తోందన్నది అత్యంత కీలకం

## ప్రపంచస్థాయి ఆర్థిక శక్తిగా దేశం మారుతోంది

## ఎవరికీ నష్టం కలిగించకుండా ఎదుగుతున్నాం

## ప్రమాదంలో ప్రపంచీకరణ: ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** ప్రజాస్వామ్యానికి.. భారత్ మాతృభూమి వంటిదని, ఏ విషయంపైనైనా దేశ ప్రజలు స్వేచ్ఛగా చర్చిస్తారని ప్రధాని మోదీ అన్నారు. ప్రభుత్వానికి అధికారం ఉన్నప్పటికీ దాని లక్ష్యం.. పౌరులను వ్యవస్థలపై ఆధారపడేలా చేయడం కాదని తెలిపారు. బ్లూంబర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్ సదస్సులో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "దేశంలో 100కు పైగా భాషలు మాట్లాడేవారు ఉన్నారు. సుమారు 80 వేల రిజిస్టర్డ్ వార్తా పత్రికలు, పబ్లికేషన్లు ఉన్నాయి. వెయ్యికిపైగా శాటిలైట్ టెలివిజన్ చానెళ్లు కూడా ఉన్నాయి. ఇదొక్కటే కాదు.. ప్రస్తుత సోషల్ మీడియా యుగంలో 50 కోట్ల మంది యూట్యూబ్ వినియోగదారులు, మరో 50 కోట్ల మంది ఇన్‌స్టా వినియోగదారులు ఉన్నారు. ప్రజలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు చెప్పేందుకు, చర్చించేందుకు డిజిటల్ వేదికలు కీలక పాత్ర పోషిస్తున్నాయి." అని పేర్కొన్నారు. జ్ఞానం, సంపద, అధికారం ఎవరి వద్ద ఉన్నా.. వాటిని ఎలా వినియోగిస్తారన్నది అత్యంత కీలకమని, అదే నిజమైన విలువలను ప్రబోధిస్తుందని వ్యాఖ్యానించారు. కేంద్ర ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ఢిల్లీలో జరిగిన నిరసనలపై పోలీసులు ఉక్కుపాదం మోపిన మరుసటి రోజు ప్రధాని 'స్వేచ్ఛ' వ్యాఖ్యలు చేయడం గమనార్హం. నిరసనకారులపై పోలీసులు వ్యవహరించిన తీరు అంతర్జాతీయ మీడియాలో హెడ్‌లైన్స్‌లో వచ్చింది. సుప్రీంకోర్టు న్యాయవాదులు, జర్నలిస్టులు, ఐక్యరాజ్యసమితి సైతం పోలీసుల తీరుపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాయి.

### ప్రపంచంతో కలిసి...

ప్రపంచస్థాయి ఆర్థిక శక్తిగా భారత్ ఎదుగుతోందని, ఈ క్రమంలో ఎవరికీ నష్టం కలిగించకుండా ప్రపంచ దేశాలతో కలిసి పనిచేస్తోందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. ఇతర దేశాలకు నష్టం కలిగించకుండా, అవి కూడా అభివృద్ధి చెందాలని కోరుకునే దేశంగా భారత్ ఉందన్నారు. "ప్రపంచం కోసం.. ప్రపంచంతో కలిసి ఎదుగుతాం" అని ప్రధాని అన్నారు.

### వాటినే ఆయుధాలుగా..

ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న కొన్ని పరిస్థితులు ప్రపంచీకరణను ప్రమాదంలోకి నెడుతున్నాయని ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది.. ప్రపంచ దేశాలను వ్యూహాత్మక బలహీనతకు గురి చేస్తోందని హెచ్చరించారు. "సరఫరా వ్యవస్థలు, ఇంధనం, కీలక ఖనిజాలు, చెల్లింపుల వ్యవస్థ, సాంకేతికత వంటివి భౌగోళిక రాజకీయ ఒత్తిడి సాధనాలుగా మారుతున్నాయి. ఇది ప్రపంచీకరణను, ఆయా దేశాలను వ్యూహాత్మక బలహీనతలకు గురిచేస్తోంది. ఒకప్పుడు ప్రపంచ దేశాలను కలిపిన అంశాలనే.. ఇప్పుడు ఆయుధాలుగా మారుస్తున్నారు." అని ఆందోళన వ్యక్తం చేశారు.

# దసరాకు 7వేల ప్రత్యేక బస్సులు

### రంగారెడ్డి రీజియన్ రీజినల్ మేనేజర్ శ్రీదేవి

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** బతుకమ్మ, దసరా పండుగలకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు రంగారెడ్డి రీజియన్ రీజినల్ మేనేజర్ శ్రీదేవి తెలిపారు. దసరా ప్రత్యేక ఆపరేషన్లపై ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, పారిశుధ్యంపై మంగళవారం మహాత్మాగాంధీ బస్ స్టేషన్‌లో ఆమె సమన్వయ సమావేశం నిర్వహించారు. అక్టోబరు 9 నుంచి 20 వరకు 7 వేల ప్రత్యేక బస్సులు నడిపేలా ప్లాన్ చేసినట్లు పేర్కొన్నారు. గ్రేటర్ నుంచి ఏపీ, తెలంగాణ జిల్లాలకు అక్టోబరు 16న 1,354, 17న 1,211 బస్సులు నడపనున్నట్లు తెలిపారు. ప్రధాన ట్రాఫిక్ కూడళ్లు, ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, బస్‌స్టేషన్ల వద్ద పోలీస్ సిబ్బందిని, షీటీమ్స్‌ను అదనంగా నియమించాలని పోలీస్‌శాఖను కోరారు. ఎంజీబీఎస్ పరిసరాల్లో దోమలనివారణకు ఫాగింగ్ యంత్రాలతో చర్యలు చేపట్టాలని, వీధి కుక్కల సమస్యను నియంత్రించాలని సూచించారు. ప్రయాణికులను తరలించే వైట్ నంబర్ ప్లేట్ కార్లను అరికటేకట్టేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని డీటీసీ సదానందంను కోరారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి, డీటీసీ సదానందం, సికింద్రాబాద్ జోన్ ఏసీపీ శ్రీనివాస్, చార్మినార్ ఏసీపీ లక్ష్మణ్, ట్రాఫిక్ సీఐలు పాల్గొన్నారు.

# గంగా నదిలో పడవ బోల్తా..13 మంది మృతి

**పట్నా, అక్టోబరు 13 :** బిహార్‌లోని వైశాలీ జిల్లాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. రామ్‌పూర్ శ్యామ్‌చంద్ పంచాయతీ పరిధిలోని గంగా నదిలో మంగళవారం రాత్రి ఓ పడవ బోల్తా పడింది.. ఈ ప్రమాదంలో గంగా నదిలో మునిగి 13 మంది ప్రాణాలు కోల్పోగా మరో నలుగురు గల్లంతయ్యారు. ప్రాణాలతో బయటపడిన మరో ఏడుగురు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రామ్‌పూర్ శ్యామచంద్ గ్రామానికి చెందిన కొందరు ఓ వేడుక కోసం వెళుతుండగా వారు ప్రయాణిస్తున్న పడవ గంగా నదిలో బోల్తా పడింది.

# ఎల్‌నినో ప్రభావం.. నీటిని పొదుపుగా వినియోగించండి: సీఎస్

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా హైదరాబాద్ కోర్ ఏరియాలో ముందస్తు చర్యలు చేపట్టామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ... ప్రభుత్వానికి ప్రజలందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జీహెచ్‌ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధుల్లో తాగునీటి సరఫరా సన్నద్ధతపై మంగళవారం సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో రిజర్వాయర్లలో నీటి లభ్యత తగ్గినప్పటికీ... అందుబాటులోని నీటి వనరులను సమర్థంగా వినియోగించాలని అధికారులను ఆదేశించారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, మంజీరా, కృష్ణా, గోదావరి నదుల నుంచి ప్రస్తుతం 560 ఎంజీడీల నీటి లభ్యత ఉందని వివరించారు.

# ఇకపై రాష్ట్రాలకు ఓట్ చోరీ సమరం

## ఓట్‌చోరీ వ్యతిరేక నిరసనలను ఓట్ చోరీ విస్తరిద్దాం

## ఇండి కూటమి భేటీలో నిర్ణయం..

## దేశవ్యాప్తంగా 5 రాష్ట్రాల్లో బహిరంగ సభలు

## లక్ష్యాన్ని సాధించేదాకా పోరు: రాహుల్

## దసరా తర్వాత హైదరాబాద్‌లో సభ

## మీడియాతో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

## 25-26 తేదీల్లో సభ జరిగే చాన్స్!



**న్యూఢిల్లీ :** ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం తాము చేస్తున్న పోరాటాన్ని.. ఒక తార్కిక ముగింపునకు వచ్చే వరకూ కొనసాగించాలని ఇండి కూటమి నిర్ణయించింది. ఓట్ చోరీకి వ్యతిరేకంగా ఇప్పటి వరకూ దేశ రాజధానిలో పలు నిరసన ప్రదర్శనలు నిర్వహించిన ఆ కూటమి.. తమ కార్యాచరణ ప్రణాళికను రాష్ట్రాలకు కూడా విస్తరించాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. మంగళవారం ఇక్కడ రాహుల్ గాంధీ నివాసంలో జరిగిన సమావేశంలో.. ఇండి కూటమి నేతలు, విద్యార్థి నాయకులు, పౌర సమాజానికి చెందిన నేతలు పాల్గొని, పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఓట్ చోరీకి వ్యతిరేకంగా సోమవారం ఢిల్లీలో కనీవినీ ఎరుగని రీతిలో పెద్దఎత్తున నిర్వహించిన నిరసన ప్రదర్శన ఘన విజయం సాధించడం పట్ల వారు హర్షం వ్యక్తంచేశారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలను, అర్హులైన ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తున్న విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని నిశ్చయించారు. ఆందోళనలను రాష్ట్రాలకు విస్తరించే ప్రణాళికలో భాగంగా తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల్లో ఇండి కూటమి నేతలతో పెద్ద ఎత్తున బహిరంగ సభలు కూడా నిర్వహించాలని నిర్ణయించింది. అందులో భాగంగా దసరా పండుగ తర్వాత హైదరాబాద్ వేదికగా భారీ మార్చ్, బహిరంగ సభ నిర్వహించనున్నట్టు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఈ సభ నిర్వహణ తేదీ, ఇతర వివరాలను ఇండి కూటమి అగ్రనేతలు త్వరలోనే ఖరారు చేస్తారని చెప్పారు. అయితే.. ఈ నెల 25–26 తేదీల్లో ఆ సభను నిర్వహించే అవకాశం ఉన్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. కాగా.. ఈ భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన రాహుల్‌గాంధీ.. తమ లక్ష్యాన్ని సాధించేంతవరకూ తమ పోరు ఆగదని స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, ఎన్నికల వ్యవస్థను కాపాడేందుకు అవసరమైన అన్ని పోరాటాలనూ విస్తృతం చేస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు వేదికైన జంతర్ మంతర్‌ను నిరసన, ప్రదర్శనలు నిర్వహించకుండా నిషేధించడం వల్ల సమస్య తీవ్రతరం అవుతుందని, ప్రభుత్వానికి గడ్డు రోజులు వస్తాయని ఆయన హెచ్చరించారు. ఎన్నికల వ్యవస్థను కుప్పకూల్చాలన్న ప్రధాన ఆలోచన నరేంద్రమోదీది అయితే దానిని అమలు చేసే నేత అమిత్ షా అని రాహుల్ ఆరోపించారు. తమ చుట్టూ వల బిగుస్తోందనే విషయాన్ని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తదితరులు గ్రహించారని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని విధ్వంసం చేసిన వారు తప్పించుకోలేరని హెచ్చరించారు. ఢిల్లీ ఛలో పేరుతో తాము జరిపిన ఊరేగింపు మొత్తం దేశ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించిందని రాహుల్ పేర్కొన్నారు. రాజకీయాలతో సంబంధం లేని సగటు మానవుని ఆలోచన ఈ నిరసన ప్రదర్శనలో వ్యక్తీకృతమైందన్నారు. సుప్రీంకోర్టు పట్ల, న్యాయవ్యవస్థ పట్ల ప్రతిపక్షానికి ఎంతో గౌరవం ఉందని, అది తనపాత్రను తాను పోషిస్తుందనే విశ్వాసం తమకు ఉందని రాహుల్ పేర్కొన్నారు. మోదీ ఓట్ చోరీ గురించి ప్రజలకు తెలిసిపోయిందని.. ఏం జరిగినా ప్రజల ప్రతిఘటన ఆగదని, అంతిమ విజయం ప్రజలదేనని చెప్పారు. ఈ సమావేశంలో మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, సుప్రియా సూలే, సంజయ్ రౌత్, డి.రాజా, తెలంగాణ, కర్ణాటక సీఎంలు రేవంత్, డీకే శివకుమార్, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, తెలంగాణ మంత్రులు పొంగులేటి, వివేక్, పొన్నం, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణా రావు, ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఆర్.రఘురాం రెడ్డి, సురేష్ షెట్కార్, బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# జంతర్ మంతర్‌లో మళ్ళీ అలజడి

## జంతర్‌మంతర్' బారికేడ్లు దాటిన సీజేపీ

## సౌరవ్ దాస్, అశుతోష్ రంకా, షిండే సహా పలువురి అరెస్టు

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే దాకా ఉద్యమిస్తాం: సీజేపీ

## నేడు ఢిల్లీలో ఆందోళన ఖాయం: దీప్కే



**న్యూఢిల్లీ :** న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మరోసారి ఉద్రిక్తత నెలకొంది. జంతర్‌మంతర్ వద్ద నిరసనలకు అవకాశం లేకుండా ఢిల్లీ పోలీసులు సోమవారం ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో ఆ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయితే, ఆ బారికేడ్లను దాటేందుకు కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) మంగళవారం యత్నించింది. ఈ క్రమంలో తమ ముఖ్యనేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా, అజింక్య షిండే తదితరులను పోలీసులు అరెస్టు చేశారని సీజేపీ ప్రకటించింది. ప్రభుత్వ ఉత్తర్వులను అతిక్రమించి జంతర్‌మంతర్‌లో బ్యారికేడ్లు దాటారనే ఆరోపణలపై సౌరవ్ దాస్, అశుతోష్ సహా 11 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని పోలీసులు వెల్లడించారు. అయితే, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ నిరసన తెలిపే తమ హక్కును ఉపయోగించుకునేందుకు తాము జంతర్‌మంతర్‌లోకి వెళ్లామని సీజేపీ ఈ సందర్భంగా పేర్కొంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ ఉద్యమం ఆగదని స్పష్టం చేసింది. ఎవరూ ఏం చేసినా సరే.. జ్ఞానేశ్ కుమార్ జంతర్ మంతర్ వద్ద రాజీనామా చేయడం ఖాయమని అశుతోష్ రంకా పేర్కొన్నారు. జంతర్ మంతర్ వద్ద ఆందోళనలు చేయకుండా నిషేధం విధించేందుకు హోం శాఖ ఎవరని సౌరవ్ దాస్ ప్రశ్నించారు. ఇక, జాతీయ జెండాలు పట్టుకొని జంతర్‌మంతర్‌లోకి ప్రవేశించిన కాక్రోచ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారంటూ సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎక్స్‌లో ఓ వీడియోను పోస్టు చేశారు. ' తిరుగుబాటును ఆపడం మీవల్ల కాదు' అంటూ ప్రధాని మోదీని ఆ పోస్టుకు ట్యాగ్ చేశారు. తన నాయనమ్మ అంత్యక్రియల కోసం మహారాష్ట్రలోని తన స్వగ్రామం పింప్రికి వెళ్లిన అభిజీత్ దీప్కే.. మంగళవారం అక్కడి విలేకరులతో మాట్లాడారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్ చేస్తూ సీజేపీ ఆధ్వర్యంలో ఢిల్లీలో బుధవారం ఆందోళన చేయడం ఖాయమన్నారు. నిరసనకు వెళ్లనీయకుండా పోలీసులు తనని అడ్డుకుంటే.. అక్కడి నుంచే నిరసన మొదలుపెడతానని దీప్కే స్పష్టం చేశారు. జంతర్‌మంతర్ వద్ద నిరసనలను నిషేధిస్తే ఆందోళనలు ఆగిపోతాయని ప్రభుత్వం అనుకుంటోందని, కానీ, దేశమంతా జంతర్‌మంతర్ అవుతుందని దీప్కే హెచ్చరించారు

### కాంగ్రెస్ ఆకస్మిక ఆందోళన, అరెస్టులు

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ యువత విభాగం ఎన్ఎస్‌యూఐ(నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా) ఢిల్లీలో మంగళవారం ఆకస్మిక ఆందోళన చేపట్టింది. ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు వినోద్ జాఖర్ నేతృత్వంలో వందలాది మంది జంతర్‌మంతర్ సమీపంలోని రాజీవ్ చౌక్ మెట్రో స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఆందోళనకారులను అడ్డుకున్న పోలీసులు వందల మందిని అదుపులోకి తీసుకున్నారు. అధికార యంత్రాంగం పోలీసులను ఉపయోగించి శాంతియుత నిరసనలను అడ్డుకుంటోందని ఎన్ఎస్‌యూఐ ఈ సందర్భంగా ఆరోపించింది.

# నిరసనల వేదికలకు మస్తు గిరాకి

## డిసెంబరు 29, 30, 31 తేదీల్లో మాత్రమే ఖాళీ

## నిరసన ప్రాంతంగా ప్రకటించిన మరుసటి రోజే ప్రకటన

## బుకింగ్‌కు 1.21లక్షలు.. ఇందులో రూ.55వేలు డిపాజిట్



**న్యూఢిల్లీ :** ఏదైనా కార్యక్రమం కోసం ఎవరైనా రామ్‌లీలా మైదాన్‌ను బుక్ చేసుకోవాలనుకుంటే ఈ ఏడాదిలో కేవలం 3 రోజులే అవకాశం ఉందని, డిసెంబరు 29, 30, 31తేదీలకు మాత్రమే ఇంకా బుకింగ్ మిగిలి ఉందని, మిగతా అన్ని రోజులకు బుకింగ్స్ అయిపోయాయని అధికారులు వెల్లడించారు. అంటే డిసెంబరు 29వ తేదీ వరకు రామ్ లీలా మైదాన్ ఖాళీగా ఉండదన్న మాట. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా కోసం ఇటు సీజేపీ, అటు విపక్షాలు ఢిల్లీలో భారీ ఎత్తున ఆందోళనలు చేస్తున్న, ఆందోళనలను ఇంకా ఉధృతం చేయాలనుకుంటున్న క్రమంలోనే మైదానం కేవలం మూడు రోజులు, అది కూడా రెండున్నర నెలల తర్వాత ఖాళీగా ఉంటుందన్న ప్రకటన రావడం గమనార్హం. ఇన్నేళ్లుగా 'నిరసనలు తెలియజేయాల్సిన ప్రాంతం'గా ఉన్న జంతర్ మంతర్ హోదాను ఢిల్లీ పోలీసులు తొలగించి.. రామ్ లీలా మైదాన్, బురారీ గ్రౌండ్, సీబీడీ గ్రౌండ్‌లను కొత్త నిరసన ప్రాంతాలుగా ప్రకటించిన మరుసటి రోజే ఈ ప్రకటన వెలువడింది. రామ్‌లీలా మైదాన్ 12ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇక్కడ ఏదైనా కార్యక్రమం అయితే 50వేల మంది పాల్గొనవచ్చు. ఒక్క రోజు బుకింగ్ చేసుకోవాలంటే రూ.1.21లక్షలు చెల్లించాలి. ఇందులో రూ.55వేలు సెక్యూరిటీ డిపాజిట్. రామ్‌లీలా మైదాన్‌ను బుకింగ్ ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ హార్టికల్చర్ విభాగం అనుమతి ఇస్తతంది. దరఖాస్తుకు ఢిల్లీ పోలీసుల నుంచి ఎన్‌వోసీ తప్పనిసరి.

ప్రజా దీవెన
సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

# బీఎస్ఏ జాతీయ అవార్డుకు వంగపల్లి రమేష్ కుమార్ ఎంపిక



**శాలిగౌరారం :** నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం అంబారిపేట గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు వంగపల్లి రమేష్ కుమార్ బహుజన సాహిత్య అకాడమీ (బీఎస్ఏ) జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. మంగళవారం హైదరాబాద్ లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో బీఎస్ఏ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా ఎంపిక పత్రాన్ని అందుకున్నారు. కరోనా విపత్కర పరిస్థితుల తో పాటు, పలు సామాజిక సేవలు, తాను ప్రజలకు అందించిన సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసినట్లు రమేష్ కుమార్ తెలిపారు. నవంబర్ 15న ఢిల్లీలో జరిగే బహుజన సాహిత్య అకాడమీ 20వ జాతీయ సదస్సులో అవార్డును అందుకోనున్నట్లు తెలిపారు.

# వల్లాలలో అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు



**శాలిగౌరారం :** నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలోని శ్రీ పార్వతీ శంభులింగేశ్వర స్వామి దేవాలయంలో శివ దుర్గా కమిటీ ఆధ్వర్యంలో 16వ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు దేవాలయంలో కొలువైన అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీ శివ సాయి రైస్ ఇండస్ట్రీస్ యాజమాన్యం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారి ఆధ్వర్యంలో అన్నప్రసాదం గ్రామస్థులకు వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ పార్ట్నర్స్ కన్మంతరెడ్డి కేశవరెడ్డి, దోనూరి సత్తిరెడ్డి నర్సిరెడ్డి, ఆలయ పూజారి వావిలాల రామలింగ శర్మ, గ్రామ సర్పంచ్ భూపతి తిరుపతమ్మ-ఉపేందర్ గౌడ్, ఉప సర్పంచ్ రాగి దావీదు, మాజీ సర్పంచ్ భూపతి మంగమ్మ వెంకన్న గౌడ్, మాజీ ఎంపీటీసీ మాధగోని కవిత రామలింగయ్య , శివ దుర్గా కమిటీ సభ్యులు, భవానీ మాలలు ధరించిన భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పీఆర్టీయూటీఎస్ జిల్లా కార్యవర్గంలో శాలిగౌరారం మండలానికి చోటు

**శాలిగౌరారం :** పీఆర్టీయూటీఎస్ నల్గొండ జిల్లా నూతన కార్యవర్గంలో శాలిగౌరారం మండలానికి చెందిన ఉపాధ్యాయులకు చోటు దక్కింది. జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా షేక్ ఫజల్ పాషా, టీ. వీరాస్వామి, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా వై. నిర్మల సుజాత, ఉపాధ్యక్షులుగా అనుముల శ్రీనివాస్, ఎండీ ఇస్మాయిల్, కుక్కడపు శ్రీనివాస్ ఎన్నికైనా సందర్భంగా మండల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పీఆర్టీయూటీఎస్ శాలిగౌరారం మండల శాఖ తరపున మండల అధ్యక్షులు పున్న శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గుత్తా ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# ఉపాధి హామీ ఉద్యోగులకు దసరా కానుక

## 3,800 మంది ఉద్యో గులకు గ్రాట్యుటీ మంజూరు

## ఒక్కొక్కరికి రూ.10 లక్షల వరకు ప్రయోజనం!

**ప్రజా దీవెన, హైదరాబాద్:** తెలం గాణలో జాతీయ గ్రామీణ ఉపా ధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయిస్ (F TE)కు రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీ పి కబురు అందించింది. ఎన్నో ఏ ళ్లుగా గ్రాట్యుటీ కోసం ఎదురు చూస్తున్న ఉద్యోగుల పోరాటాని కి ఫలితం దక్కింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3,800 మంది ఉ ద్యోగులకు గ్రాట్యుటీ మంజూరు చేస్తూ ప్రభుత్వం తాజాగా అధికారిక ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం.

### కనీసం రూ.4 లక్షలు.. గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు

ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణ యం ప్రకారం అర్హులైన ఉద్యోగు లకు పదవీ విరమణ సమయంలో కనీసం రూ.4 లక్షల గ్రాట్యుటీ లభించనుంది. పదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు సుమారు రూ.10 లక్షల వరకు ఆర్థిక ప్రయోజనం చేకూరే అవ కాశం ఉంది. దీంతో దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉద్యోగులకు పద వీ విరమణ అనంతరం ఆర్థిక భ రోసా లభించనుంది.

### ఉద్యోగ సంఘాల్లో హర్షాతి రేకాలు

ఏళ్ల తరబడి తమ హక్కు కోసం పోరాడిన ఉద్యోగులకు ఈ నిర్ణ యం ఊరటనిచ్చింది. పదవీ వి రమణ తర్వాత కుటుంబ పోష ణ, ఆర్థిక అవసరాలకు గ్రాట్యుటీ ఉపయోగపడుతుందని ఉ ద్యోగ సంఘాల నాయకులు అభిప్రా యపడ్డారు. దసరా పండుగకు ముందు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవం త్ రెడ్డికి, సంబంధిత అధికారుల కు కృత జ్ఞతలు తెలిపారు. ఉ ద్యోగుల భవిష్యత్తుకు భరోసా కల్పించే దిశ గా ఈ నిర్ణయం కీ లక ముందడుగుగా నిలుస్తుంద ని ఉద్యోగ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# ఎల్బీనగర్, హయత్‌నగర్ డబుల్‌డెక్కర్ కారిడార్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

## హైదరాబాద్ ట్రాఫిక్ కష్టాలకు పరిష్కారం దిశగా కీలక ముందడుగు

**ప్రజా దీవెన, హైదరాబాద్:** హైదరాబాద్ మహానగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించి, ప్రయాణాన్ని మ రింత వేగవంతం చేసే దిశగా కీల క పరిణామం చోటుచేసుకుంది. ఎల్బీనగర్--హయత్‌నగర్ డబుల్‌డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ ప్రా జెక్టుకు కేంద్ర రోడ్డు రవాణా, జా తీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. తెలంగాణలో మౌ లిక వసతుల అభివృద్ధి, జాతీయ రహదారుల విస్తరణకు సం బంధించిన పలు కీలక అంశాలపై చర్చించేందుకు మంత్రి కోమటిరె డ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం కేం ద్ర మంత్రి నితిన్ గడ్కరీతో సమా వేశమయ్యారు. ఈ భేటీలో ఎల్బీనగర్--హయత్‌నగర్ డబుల్ డె క్కర్ ఎలివేటెడ్ కారిడార్‌తో పా టు రాష్ట్రంలో చేపట్టాల్సిన ఇతర కీలక రహదారి ప్రాజెక్టులపై చ ర్చించారు. అదే సమయంలో తె లంగాణలో రహదారుల అభివృ ద్ధికి మరింత ఊతమిచ్చేలా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. కేంద్ర రోడ్డు ర వాణా, జాతీయ రహదారుల శా ఖ మంత్రి నితిన్ గడ్కరీతో ప్ర త్యేకంగా సమావేశమైన ఆయన రాష్ట్రంలో చేపట్టాల్సిన పలు కీల క రహదారులు, వంతెనలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంపై చ ర్చించారు. తెలంగాణ రవాణా వ్యవస్థను మరింత ఆధునికంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రయాణ స మయాన్ని తగ్గించేలా పలు ప్ర తిపాదనలను కేంద్రం దృష్టికి తీ సుకెళ్లారు.



### ఎన్‌హెచ్ 765పై డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశాలు

ఎన్‌హెచ్ 765పై ప్రతిపాదిత ఎలి వేటెడ్ కారిడార్‌కు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేయాలని అధికారులను నితిన్ గడ్కరీ ఆదేశించారు. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే హై దరాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రా ఫిక్ సమస్యల పరిష్కారానికి, ప్ర యాణ సమయం తగ్గించేందుకు దోహదపడే అవకాశం ఉంది.

### కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జ్ ప్రతిపాదనకు ఆమోదం

తెలంగాణలో రవాణా సదుపా యాలను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో కృష్ణా నదిపై ఐకానిక్ కే బుల్ బ్రిడ్జ్ నిర్మాణానికి శంకుస్థా పన చేయాలన్న ప్రతిపాదనకు కూడా కేంద్ర మంత్రి ఆమోదం తె లిపినట్లు సమాచారం. ఈ ప్రా జెక్టు రాష్ట్ర రహదారి అనుసంధా నాన్ని బలోపేతం చేయడంలో కీ లకంగా మారనుంది.

### ఇండియన్ రోడ్ కాంగ్రెస్‌కు ఆ హ్వానం

హైదరాబాద్‌లో నవంబర్ 19 నుంచి 22 వరకు జరగనున్న ఇం డియన్ రోడ్ కాంగ్రెస్ కార్యక్ర మా నికి హాజరుకావాలని కేంద్ర మం త్రి నితిన్ గడ్కరీని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆహ్వానించారు. మొత్తంగా, కేంద్ర మంత్రితో జరి గిన ఈ సమావేశం తెలంగాణలో రహదారి మౌలిక వసతుల అభి వృద్ధికి ప్రాధాన్యతనిచ్చే దిశగా కీ లక అడుగుగా నిలిచింది. అయి తే డబుల్‌డెక్కర్ కారిడార్ నిర్మా ణానికి సంబంధించిన తదుపరి కార్యాచరణ, డీపీఆర్ రూపకల్ప న, ఇతర అనుమతుల పురోగతి పై స్పష్టత రావాల్సి ఉంది.

### ఢిల్లీ పర్యటనతో తెలంగాణకు భారీ రహదారుల ప్రాజెక్టులు శ్రీశైలం హైవేపై ఎలివేటెడ్ కారిడా ర్

హైదరాబాద్--శ్రీశైలం జాతీయ రహదారిపై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి కొత్త సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేయాలని కేంద్ర మంత్రి అధికారులకు సూచించినట్లు వెల్లడించారు. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే ఆ మార్గంలో రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.

### హైదరాబాద్--విజయవాడ-మచిలీపట్నం మార్గానికి ప్రాధాన్యం

హైదరాబాద్--విజయవాడ--మచిలీపట్నం జాతీయ రహదారి విస్తరణ పనులను వేగవంతం చేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదనపైనా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

### ఐదు రోప్‌వేలు.. మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిలు

తెలంగాణలో ఐదు రోప్‌వేల ఏర్పాటుకు ఆమోదం లభించడం మరో కీలక అంశంగా నిలిచింది. సేతు బంధన్ పథకం కింద మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి కూడా ఆమోదం లభించినట్లు వెల్లడించారు. వీటి ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు రైల్వే క్రాసింగ్‌ల వద్ద వాహనదారులు ఎదుర్కొనే ఇబ్బందులు తగ్గే అవకాశం ఉంది.

### 34 అభివృద్ధి పనులకు నిధుల కోసం విజ్ఞప్తి

తెలంగాణలో చేపట్టాల్సిన 34 అభివృద్ధి పనులకు కేంద్ర రహదారి మౌలిక సదుపాయాల నిధి (జ=×ఖీ) కింద నిధులు మంజూరు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. రాష్ట్రంలోని పలు రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలన్న ప్రతిపాదనలను కూడా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.



### ఇండియన్ రోడ్ కాంగ్రెస్‌కు గడ్కరీకి ఆహ్వానం

హైదరాబాద్‌లో నవంబర్ 19 నుంచి 22 వరకు జరగనున్న ఇండియన్ రోడ్ కాంగ్రెస్ కార్య క్రమానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆహ్వానించారు. ఈ సమావే శంలో మంత్రి జూపల్లి కృష్ణా రా వుతో పాటు పలువురు ప్రజాప్ర తినిధులు, అధికారులు పాల్గొ న్నారు. తెలంగాణలో రహదారి కనెక్టివిటీని బలోపేతం చేయడం, ట్రాఫిక్ సమస్యలను తగ్గించడం, ప్రయాణ సమయాన్ని ఆదా చే యడం, పర్యాటక రంగానికి ఊ తమివ్వడం లక్ష్యంగా రాష్ట్ర ప్ర భుత్వం పలు కీలక ప్రాజెక్టులపై దృష్టి సారిస్తోంది. కేంద్రంతో సమ న్వయం ద్వారా ఈ ప్రతిపాదన లు కార్యరూపం దాల్చితే తెలం గాణ మౌలిక సదుపాయాల అభి వృద్ధికి మరింత బలం చేకూర నుంది.

# బకాయిపడిన రైస్ మిల్లర్లకు షాక్

## ఆస్తుల జప్తునకు సర్కార్ సిద్ధం
## సీఎంఆర్ బకాయిల వసూలుకు RR చట్టం ప్రయోగం
## యంత్రాల వేలానికి రంగంసిద్ధం



**ప్రజా దీవెన, హైదరాబాద్:** ధాన్యం సేకరణకు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (CMR) బకాయిల వసూలుపై తెలంగాణ పౌర సరఫరాల శాఖ మరింత కఠినంగా వ్యవహరించేందుకు సి ద్ధమైంది. ప్రభుత్వానికి బియ్యం లేదా ధాన్యం అప్పగించకుండా బకాయిలు చెల్లించని రైస్ మిల్లర్లపై రెవెన్యూ రికవరీ (RR) చట్టం కింద చర్యలు చేపట్టాలని నిర్ణ యించింది. అవసరమైతే బకా యిదారుల ఆస్తులను జప్తు చే యడంతోపాటు మిల్లుల్లోని యం త్రాలను వేలం వేసి బకాయిలను రాబట్టేందుకు కార్యాచరణ రూ పొందిస్తోంది.

### అధికారులకు కమిషనర్ కీలక ఆదేశాలు

పౌర సరఫరాల శాఖ కమిషనర్, ప్రభుత్వ ఎక్స్-అఫీషియో ప్రిన్సి పల్ సెక్రటరీ ఎం. స్టీఫెన్ రవీంద్ర, ఐపీఎస్.. బకాయిల వసూలుకు చేపట్టాల్సిన చట్టపరమైన చర్య లపై క్షేత్రస్థాయి అధికారులకు శి క్షణ ఇచ్చారు. మూడు బ్యాచ్ లుగా పాల్గొన్న డిప్యూటీ తహ శీల్దార్లకు విధుల నిర్వహణలో ని ర్లక్ష్యం వహించవద్దని సూచిం చారు. నిబంధనల ప్రకారం నిజాయి తీగా, నిర్భయంగా పనిచేసే అధి కారులకు శాఖాపరమైన రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

### ప్రతి బుధవారం ఆకస్మిక తనిఖీలు

బకాయిదారుల వద్ద నిల్వల వివరాలను గుర్తించేందుకు ఫిజికల్ వెరిఫికేషన్ (PV) మొబైల్ యాప్‌ను వినియోగించనున్నారు. ప్రతి బుధవారం రైస్ మిల్లుల్లో ఆక స్మిక స్టాక్ తనిఖీలు నిర్వహించా లని నిర్ణయించారు. తనిఖీల స మయంలో నిల్వల వివరాలు, ధాన్యం, బియ్యం లెక్కలను పరి శీలించి, అవసరమైన డిజిటల్ ఆధారాలను సేకరించేలా అధికా రులకు శిక్షణ ఇచ్చారు. భవిష్య త్తులో న్యాయపరమైన సమ స్య లు తలెత్తకుండా చట్టబద్ధమైన విధానాల్లోనే చర్యలు చేపట్టడం పై దృష్టి సారించారు.

### బకాయిల వసూలుకు ప్రత్యేక కార్యాచరణ

శిక్షణ అనంతరం అధికారుల సా మర్థ్యాన్ని పరీక్షించేందుకు ప్రాక్టి కల్ మాక్ టెస్టులు నిర్వహించారు. నగదు రూపంలోనైనా, ధా న్యం లేదా బియ్యం రూపంలోనై నా ప్రభుత్వానికి రావాల్సిన బ కాయిలను నిబంధనల ప్రకారం వసూలు చేయడమే లక్ష్యంగా శాఖ ముందుకు సాగుతోంది.

### జిల్లా స్థాయి అధికారులకూ శిక్షణ

తదుపరి దశలో జిల్లా పౌర సర ఫరాల అధికారులు (DCSO\T), జిల్లా మేనేజర్లకు (DM\T) కూ డా ఇదే తరహా చట్టపరమైన, వ్యూహాత్మక శిక్షణ ఇవ్వ ను న్నా రు. ప్రభుత్వ ఖజానాకు రావా ల్సిన బకాయిలను రాబట్టడం, ప్రజాధనాన్ని పరిరక్షించడం ల క్ష్యంగా పౌర సరఫరాల శాఖ ఈ చర్యలను చేపడుతోంది. బకా యిల విషయంలో నిబంధనలు ఉల్లంఘించిన మిల్లర్లపై చట్టప్ర కారం చర్యలు తీసుకునే దిశగా అధికారులు సిద్ధమవుతున్నారు.

# పర్యాటక ప్రాంతాల్లో ఫైవ్ స్టార్ హోటల్‌ల నిర్మాణానికి స్థలాల గుర్తింపు

**ప్రజా దీవెన, నల్లగొండ టౌన్:** నల్గొండ జిల్లాలో ముఖ్యమైన పర్యాటక ప్రాంతాల వద్ద ఫైవ్ స్టార్ హోటల్ ల నిర్మాణానికి స్థలాలను గుర్తించినట్లు స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ కు తెలిపారు . మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ హైదరాబాద్ నుండి బతుకమ్మ సంబరాలు, పర్యాటక శాఖ కార్యక్రమాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు ,పర్యటక , ఇతర సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నల్గొండ జిల్లాలో పర్యాటక ప్రాంతాలలో టూరిజం హోటళ్ల నిర్మాణానికి గాను స్థలాల వివరాలను అడిషనల్ కలెక్టర్ వివరిస్తూ బుద్ధవనం, దేవరకొండకోట, వైజాగ్ కాలనీ, ఛాయా సోమేశ్వర దేవాలయం, తదితర 5 ప్రాంతాలలో సైట్లను గుర్తించడం జరిగిందని, త్వరలోనే ఇందుకు సంబంధించిన డిపిఆర్ ను సమర్పిస్తామని తెలిపారు. అలాగే దేవరకొండ కోటతో పాటు, వైజాగ్ కాలనీ ఛాయా సోమేశ్వర దేవాలయం, తదితర ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అవకాశాలు ఉన్నాయని, వైజాగ్ కాలనీలో 5 కోట్ల రూపాయలతో రిసార్ట్ తో పాటు, వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటు చేస్తే బాగుంటుందన్న ఉద్దేశంతో త్వరలోనే డిపిఆర్ సమర్పిస్తామని తెలిపారు. దేవరకొండ కోట,ఛాయా సోమేశ్వర దేవాలయాల వద్ద సెక్యూరిటీ గార్డ్ లను నియమించాలని, స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆదేశించగా, అందుకు తగ్గట్టుగా ఏర్పాటు



చేస్తామని అదనపు కలెక్టర్ తెలిపారు. అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జిల్లాలలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, 18న సద్దుల బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించాలని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉత్సవాలు ఉండాలని, బతుకమ్మ ఉత్సవాలకు సంబంధించి ప్రతిరోజు నిర్వహించే వివరాలను రాష్ట్ర స్థాయికి పంపించాలని ఆమె తెలిపారు .రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక ప్రాంతాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని,ఇందులో భాగంగా సబ్ కమిటీని కూడా ఏర్పాటు చేయడం జరిగిందని, పర్యాటక ప్రాంతాలలో పెట్టుబడులు పెట్టడం, టూరిజం హోటల్, ఫైవ్ స్టార్ హోటళ్ల నిర్మాణం, వ్యూ సైడ్ ప్రాంతాలు అభివృద్ధి ,అడ్వెంచర్ పార్కులు, వాటర్ స్పోర్ట్స్ ,అటవీ ప్రాంతాలలో ఎకో టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని ఆమె చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 142 టూరిజం డెస్టినేషన్స్ గుర్తించడం జరిగిందని, పర్యాటక ప్రాంతాలుగా ఉండి అంత ప్రాచుర్యం లేని ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అందుకు సంబంధించిన డేటా తో పాటు, వీడియోలు, చిత్రాలు పంపించాలని ఆదేశించారు. అదనపు ఎస్ పి రమేష్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి, ఇన్చార్జి టూరిజం ఆఫీసర్ అక్బ ర్ అలీ,సమాచార శాఖ సహాయ సంచాలకులు యు.వెంకటేశ్వ ర్లు, మెప్మా పిడి శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్ట ర్ రాహుల్, తదితరులు ఈ వీ డి యో కాన్ఫరెన్స్ కు హాజరయ్యా రు.

# రాష్ట్రంలో కరువు విలయ తాండవం చేస్తుంటే విలాస యాత్రలా?

**రాష్ట్రంలో ఆర్భాటాలు తప్ప అభివృద్ధి శూన్యం**

**ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి: బొల్లం**

**ప్రజా దీవెన కోదాడ :** వరంగల్–నల్గొండ–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోదాడ పట్టణలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ నివాసంలో మంగళవారం మండల మరియు పట్టణ నాయకులతో ఓటరు నమోదు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై, మంత్రుల తీరుపై తీవ్ర ఆరోపణలు చేశరు రాష్ట్రంలో వ్యవసాయ పంటలు ఎండిపోయి, సాగునీరు, కరెంటు లేక రైతులు అప్పుల పాలై గుండెలు పగిలి రోదిస్తుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మాత్రం ఢిల్లీ పర్యటనలు చేస్తున్నారని విమర్శించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గాలి మోటార్లలో విలాసవంతంగా తిరుగుతున్నారని మండిపడ్డారు. మోతే మండలంలో కనీసం నీళ్లు లేక, కరెంటు రాక రైతులు బిందెలతో, ట్యాంకర్లతో పంటలను తడుపుకుంటున్న దయనీయ పరిస్థితి నెలకొందన్నారు. కాంగ్రెస్ నాయకులు కేవలం శంకుస్థాపనలు, శిలాఫలకాలకే పరిమితమయ్యారని, ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేశారని ఆరోపించారు.



ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, అన్నంలో పురుగులు వస్తున్నాయని, కనీసం సరైన దుస్తులు, బూట్లు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. కోదాడ పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (UGD) పనుల పేరుతో వేసిన రోడ్లను పగలగొట్టి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కోదాడ చెరువు సుందరీకరణ పేరుతో మట్టిని అక్కడే తీసి కట్టలు పోస్తూ, నిధులను కాంట్రాక్టర్లు, స్థానిక నాయకులు దోచుకుంటున్నారని తీవ్ర విమర్శలు చేశారు. ఈ పనులను తక్షణమే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. నాగార్జున సాగర్ ద్వారా ఉమ్మడి నల్గొండ జిల్లాకు దక్కాల్సిన నీటిని పక్క జిల్లాలకు (పాలేరు, ఖమ్మం) తరలిస్తున్నారని, ఈ ప్రాంతానికి చెందిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నల్గొండ రైతాంగం పట్ల ఏమాత్రం మమకారం లేకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గత పదేళ్ల కాలంలో కేసీఆర్ గారు తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని, అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని గుర్తు చేశారు. కానీ, కేవలం మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఈ దున్నపోతు లాంటి ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటి సమాధానం చెప్పాలంటే, విద్యావంతులు, నిరుద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారవేత్తలు అందరూ ఏకమై రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని అఖండ మెజార్టీతో గెలిపించాలని బొల్లం మల్లయ్య యాదవ్ పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఎస్కే నహీం కోదాడ మాజీ ఎంపీపీ చింతా కవితా రాధారెడ్డి కాపుగల్లు సర్పంచ్ దొంతగాని అప్పారావు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఉపేందర్ గౌడ్, 9వ వార్డు కౌన్సిలర్ చీమ నరేష్ నాయకులు బత్తుల ఉపేందర్, చింతల నాగేశ్వరరావు పిట్టల భాగ్యమ్మ మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నల్గొండ జిల్లాలో ఆధార్ సేవలు వేగవంతం చేయాలి

**రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్**



**ప్రజా దీవెన, నల్లగొండ టౌన్:** జిల్లాలోని ప్రజలందరికీ ఆధార్ సేవలు సులభంగా అందుబా టు లో ఉండేలా చర్యలు తీసుకోవా లని, ఇందుకు సంబంధిత శాఖ లు సమన్వయంతో పనిచేయాల ని ఆదేశించారు.మంగళవారం త న చాంబర్లో నిర్వహించిన జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమి టీ సమావేశంలో అదనపు కలె క్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని వయసుల వారి ఆధార్ నమోదు శాతాన్ని పెంచడానికి ప్రత్యేక ప్ర ణాళికలు రూపొందించాలని , జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఆధార్ జనరేషన్ ప్రక్రియ వేగాన్ని పెంచాలని, పెండింగ్లో ఉన్న దర ఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. 5 సంవ త్స రాలు మరియు 15 సంవత్సరాల వయస్సు పూర్తి చేసుకున్న పిల్ల లకు ఉచితంగా నిర్వహించే 'త ప్పనిసరి బయోమెట్రిక్ అ ప్డేట్' ప్రక్రియపై విద్యాశాఖ, ఐసిడిఎస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారిం చాలని అన్నారు. 18 సంవత్స రాలు నిండిన వారి కొత్త ఆధార్ నమోదు దరఖాస్తుల పరిశీలన మరియు రాష్ట్ర పోర్టల్ ప్యాకెట్ క్లియరెన్స్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ఆదే శా లు జారీ చేశారు. జిల్లా వ్యా ప్తంగా ఉన్న ఆధార్ ఎన్‌రోల్‌మెం ట్ కిట్ల స్థితిగతులను, వాటి పని తీరును అసిస్టెంట్ మేనేజర్ సమీ క్షించారు.సాంకేతిక సమస్యలు ఉన్న కిట్లను వెంటనే బాగు చేయాలని సూచించారు. ఆశ్ర మాలు, వృద్ధాశ్రమాలు , ప్రత్యేకిం చి మారుమూల గిరిజన సమూ హాల నివాస ప్రాంతాలలో ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలను ఏర్పాటు చేయాలని సమావేశం నిర్ణయించింది.

ఈ సమావేశానికి అదనపు ఎస్పీ రమేష్, జిల్లా విద్యాశాఖాధికారి , సుసింధర్ రావు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి దశ్రు నాయక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రాహుల్, పోస్టల్ సూపరింటెండెంట్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రామిక్, ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ దుర్గా రావు, ఆధార్ అసిస్టెంట్ మేనేజర్ శ్రవణ్, మీ సేవ ఏ ఓ రాజశేఖర్, మీ–సేవ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ శేఖర్ రెడ్డి, సిఎస్సి డిఎం ముక్కురామ్, తదితరులు హాజరయ్యారు.

# కోదాడ నియోజకవర్గ రహదారుల అభివృద్ధికి రూ.52.50 కోట్లు మంజూరు

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిల కృషితో నాలుగు ప్రధాన రహదారులకు నిధుల**

**జీవో ఆర్టీ నంబర్ 533 జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం**





**ప్రజా దీవెన,కోదాడ :** కోదాడ నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ. 52. 50 కోట్ల భారీ నిధులను మంజూరు చేసింది. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డిల ప్రత్యేక చొరవ, కృషితో నియోజకవర్గంలోని నాలుగు ప్రధాన రహదారుల విస్తరణ, పటిష్టీకరణ పనులకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది.ఈ మేరకు రాష్ట్ర రవాణా, రోడ్లు మరియు భవనాల శాఖ మంగళవారం జీవో ఆర్టీ నంబర్ 533ను జారీ చేసింది. 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్లాన్ ఎండీఆర్ నిధుల కింద మొత్తం రూ. 52. 50 కోట్లతో నాలుగు రహదారుల అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

**మంజూరైన రహదారుల వివరాలు:**

పాత జాతీయ రహదారి--9 నుంచి కొండాపురం వరకు 12. 2 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణ, పటిష్టీకరణకు రూ. 27 కోట్లు, బేతవోలు నుంచి ఆచార్యులగూడెం వరకు 5. 6 కిలోమీటర్ల మేర రహదారి అభివృద్ధికి రూ. 13. 50 కోట్లు మంజూరయ్యాయి.అదేవిధంగా పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి కిష్టాపురం రోడ్డు వరకు 2 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణకు రూ. 4. 50 కోట్లు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి రామలక్ష్మీపురం వరకు 3. 1 కిలోమీటర్ల మేర రహదారి అభివృద్ధికి రూ. 7. 50 కోట్లు మంజూరు చేశారు.ఈ నాలుగు రహదారుల అభివృద్ధి పనులతో ఆయా గ్రామాల మధ్య రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయి. ముఖ్యంగా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించేందుకు, విద్యార్థులు విద్యాసంస్థలకు వెళ్లేందుకు, ప్రజలు వైద్య, ఇతర అవసరాల కోసం ప్రయాణించేందుకు సౌకర్యవంతంగా మారనున్నాయి.

నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రభుత్వ స్థాయిలో కృషి చేశారు . మంజూరైన రహదారి పనులకు సంబంధించి తదుపరి చర్యలు చేపట్టాలని రాష్ట్ర రోడ్లు మరియు భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

**రూ.52.50 కోట్ల నిధుల మంజూరుపై హర్షం:**

కోదాడ నియోజకవర్గంలోని నాలుగు ప్రధాన రహదారుల అభివృద్ధికి రూ. 52. 50 కోట్ల నిధులు మంజూరు కావడంపై స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన అలుగుబెల్లి రవీందర్ రెడ్డి



**ప్రజా దీవెన, న్యూ ఢిల్లీ:** జన్మదిన సందర్భంగా అలుగు బెల్లి రవీం దర్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుంచి ప్రత్యేక అభినందన లు అందాయి. తన జన్మదినా న్ని పురస్కరించుకుని తెలం గాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎను ముల రేవంత్ రెడ్డిని ఢిల్లీలో మ ర్యాదపూర్వకంగా కలిసిన రవీం దర్ రెడ్డి ఆశీస్సులు అందుకున్నా రు.ఈ సందర్భంగా ముఖ్యమం త్రి రేవంత్ రెడ్డి ఆయనకు జన్మ దిన శుభాకాంక్షలు తెలియజేశా రు. రవీందర్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని జన్మదిన వేడుకలను సు ఖసంతోషాలతో జరుపుకోవాల ని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాల ని ఆకాంక్షించారు.అనంతరం భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర నాయకులు దుబ్బాక నరసింహ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పూర్ణ కైలాస నేత త దితరులు రవీందర్ రెడ్డికి జన్మ దిన శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు.ముఖ్యమంత్రి సహా పలువురు ప్రజాప్రతినిధు లు, నాయకుల నుంచి జన్మదిన శుభాకాంక్షలు అందుకోవడంతో రవీందర్ రెడ్డి జన్మదిన వేడుకల కు ప్రత్యేకత సంతరించుకుంది.

# సైబర్ నేరాలపై అవగాహన



**ప్రజాదీవన, కోదాడ:** ఎస్పీ కె నరసింహ ఐపిఎస్ గారి ఆదేశాల మేరకు కోదాడ రూరల్ SI యాకుబ్ మండల పరిధిలోని లోని దోరకుంట గ్రామం లో నేరాలు, రోడ్డు ప్రమాదాలపైన, షీ టీమ్స్ పైన పోలీసు కళాబృందంతో గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమని నిర్వహించారు ఈ సందర్భంగా కోదాడ రూరల్ SI యాకుబ్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కే. నరసింహ ఐపిఎస్ అధ్వర్యంలో సైబర్ నేరాలపై,రోడ్డు నియమ నిబంధనలపై, గంజాయి మత్తు పదార్థాలపై, షీ టీమ్స్ పై పటిష్టంగా పనిచేస్తున్నమని తెలిపారు. చదువుకునే విద్యార్థులు ఇంటర్నెట్ ను సద్వినియోగం చేసుకోవాలి, సైబర్ మోసగాళ్ళ వల్ల మోసాలకు గురి కావద్దు, బ్యాంక్ ఖాతా,ఖావీలికార్డ్ వివరాలు,ఖావివరాలు ఇతరులకు తెలపవద్దు, ఇతరులు ఆశ చూపితే వాటికి ఆకర్షితులు కావొద్దు. మెసేజ్ లలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దు అని కోరినారు.సైబర్ మోసాలపై1930టోల్ ఫ్రీ నంబర్ కు పిర్యాదు చేయాలని అన్నారు. అలాగేలి వేధింపులపై112 కు సమాచారం ఇవ్వాలని తెలిపినారు వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్ నెంబర్లు, సోషల్ మీడియాలో బహిర్గతం చేయొద్దన్నారు యువత చెడు వ్యసనాల బారిన పడొద్దు అన్నారు ఈ కార్యక్రమం లో ద్వారకుంట గ్రామ సర్పంచ్ పాలకి సురేష్, హెడ్ కానిస్టేబుల్ వెంకటరమణ, కానిస్టేబుల్ సతీష్, రాంనర్సయ్య,పోలీస్ కళా బృందం ఇంచార్జి యల్లయ్య, సభ్యులు గోపయ్య,సత్యం,చారి,కృష్ణ,నాగార్జున,గురులింగం,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నల్లగొండలో పట్టపగలే నగదు చోరీ కలకలం

**బైక్ డిక్కీలో పెట్టి న రూ.4 లక్షలు మాయం, రంగంలోకి దిగిన పోలీసులు**

**ప్రజాదీవన, నల్లగొండ క్రైమ్:** నల్లగొండ పట్టణంలో పట్టపగలే భారీ నగదు చోరీ ఘటన కలకలం రేపింది. బ్యాంకుల నుంచి డ్రా చేసి మోటార్‌సైకిల్ డిక్కీలో భద్ర పరిచిన రూ. 4 లక్షలు అదృశ్యం కావడంతో బాధితుడు లబోదిబో మంటున్నాడు. ఈ ఘటనపై పో లీసులు కేసు నమోదు చేసి ద ర్యాప్తు ప్రారంభించారు. కనగల్ మండలం రేగట్టె గ్రామాని కి చెందిన పత్తి వ్యాపారి నారా బ త్తోజు శ్రీనివాస చారి వివిధ బ్యాం కుల నుంచి మొత్తం రూ. 4 లక్ష లు డ్రా చేశారు. సెంట్రల్ బ్యాంక్ నుంచి రూ.లక్ష, ఐడీఎఫ్‌సీ బ్యాం క్ నుంచి మరో రూ. 3 లక్షలు తీసుకున్నారు. అనంతరం ఆ నగ దును తన మోటార్‌సైకిల్ డిక్కీ లో పెట్టుకుని, నల్లగొండలోని పాత కలెక్టరేట్ పక్కన ఉన్న ఓ ఫైనాన్స్ సంస్థ ఎదుట బైక్‌ను పార్క్ చేశారు. ఫైనాన్స్ సంస్థలో తన పని ము గించుకుని తిరిగి వచ్చి చూడగా, బైక్ డిక్కీలో ఉంచిన నగదు కని పించలేదు. దీంతో ఆందోళనకు గురైన బాధితుడు వెంటనే పోలీ సులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు.

**సీసీ కెమెరాలపై పోలీసుల దృష్టి**

బాధితుడి ఫిర్యాదు మేరకు సెక్టా ర్ ఎస్సై ఎన్. వెంకటనారాయణ కేసు నమోదు చేశారు. ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ జి. మహాలక్ష్మయ్య ఆ ధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘటన జరిగిన ప్రాం తంలోని సీసీ కెమెరాల దృశ్యాల ను పరిశీలిస్తూ, నగదు చోరీకి పా ల్పడిన గుర్తుతెలియని వ్యక్తుల ను గుర్తించేందుకు ప్రయత్నిస్తు న్నారు. పట్టణంలో రద్దీ ప్రాంతంలో చోటు చేసుకున్న ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పో లీసులు సీసీ కెమెరాల ఆధారం గా నిందితులను గుర్తించి, చోరీకి గురైన నగదును తిరిగి రాబట్టేం దుకు చర్యలు చేపడుతున్నారు.

# రాకిల్స్ కాలనీలో వైభవంగా దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు





**ప్రజా దీవెన, నల్లగొండ టౌన్:** నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప ట్టణంలోని 32వ డివిజన్ రాకిల్స్ కాలనీ, రోడ్ నంబర్ 5లో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడవ రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దుర్గామాత మాలధారణ చేసిన భక్తులు హాజరయ్యారు. హనుమాన్ చాలీసా లక్ష గళ పారాయణం నిర్వహించారు. చిన్నారులు దుర్గామాత వేషధారణలో అలరించడంతో పాటు సాం స్కృ తిక కార్యక్రమాల్లో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. భక్తులతో మండపం సందడిగా మారింది.

# రికార్డుల గిల్.. పరుగుల రాణి షెఫాలీ.. ఐసీసీ అవార్డులు వీరికే!



భారత ఆటగాళ్లు శుభ్‌మన్ గిల్, షెఫాలీ వర్మ 'ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డులు గెలుచుకున్నారు. సెప్టెంబర్ 2026కు గానూ ప్రకటించిన పురుషుల విభాగంలో గిల్ ఈ పురస్కారాన్ని ఐదోసారి అందుకున్నాడు. మహిళల విభాగంలో షెఫాలీ రెండోసారి ఈ అవార్డును సొంతం చేసుకుంది. ఆసియా కప్, ఆసియా క్రీడల్లో షెఫాలీ రాణించగా.. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో గిల్ అదరగొట్టాడు.

### గిల్ రికార్డు.. ఐదోసారి అవార్డు

వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో గిల్ అద్భుత ప్రదర్శన చేశాడు. తిరువనంతపురంలో జరిగిన తొలి వన్డేలో 110 పరుగులు చేసి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆ తర్వాతి మ్యాచ్‌లో 133 బంతుల్లో 223 పరుగులతో చెలరేగాడు. లక్ష్య ఛేదనలో అత్యంత వేగంగా డబుల్ సెంచరీ సాధించిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. 406 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ మరో 39 బంతులు మిగిలుండగానే ఛేదించింది. గతంలో 2023 జనవరి, సెప్టెంబర్, 2025 ఫిబ్రవరి, జులై నెలల్లో గిల్ ఈ అవార్డు అందుకున్నాడు. తాజా పురస్కారంతో ఐదుసార్లు ఈ ఘనత సాధించిన ఆటగాడిగా తన రికార్డును మరింత పదిలం చేసుకున్నాడు. వెస్టిండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్ కూడా ఐదుసార్లు ఈ అవార్డును గెలుచుకున్నాడు.

### షెఫాలీకి రెండోసారి..

మహిళల విభాగంలో షెఫాలీ వర్మ తన బ్యాటింగ్ జోరుతో ఆకట్టుకుంది. ఆసియా కప్‌లో భారత్ విజయంలో కీలకంగా నిలిచింది. ఆ టోర్నీలో 360 పరుగులు సాధించడంతో పాటు ఆరు వికెట్లు పడగొట్టింది. 184.61 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు చేసింది. ఆసియా క్రీడల్లోనూ షెఫాలీ సత్తా చాటింది. బంగ్లాదేశ్‌తో సెమీఫైనల్లో అజేయంగా 100 పరుగులు చేసింది. శ్రీలంకతో ఫైనల్లో 48 పరుగులు సాధించింది. గతేడాది నవంబరులో మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాపై మ్యాచ్ గెలిపించే ఇన్నింగ్స్ ఆడినందుకు తొలిసారి ఈ అవార్డు అందుకుంది.

### భారత ఆటగాళ్లకు మూడోసారి డబుల్ ధమాకా

ఒకే దేశానికి చెందిన ఆటగాళ్లు పురుషుల, మహిళల విభాగాల్లో ఒకేసారి అవార్డులు గెలవడం ఇది ఐదోసారి. భారత ఆటగాళ్లు ఇలా రెండు పురస్కారాలు అందుకోవడం ఇది మూడోసారి. 2024 జూన్‌లో జస్ప్రీత్ బుమ్రా, స్మృతి మంధాన.. 2025 సెప్టెంబర్‌లో అభిషేక్ శర్మ, స్మృతి మంధాన ఈ ఘనత సాధించారు. ప్రపంచవ్యాప్తంగా నమోదైన అభిమానుల ఓట్లు, మాజీ అంతర్జాతీయ ఆటగాళ్లు, మీడియా ప్రతినిధులతో కూడిన నిపుణుల కమిటీ నిర్ణయం ఆధారంగా విజేతలను ఎంపిక చేశారు.



# సిరాజ్ కెప్టెన్సీ అదుర్స్

### రంజీ ట్రోఫీలో గెలుపు బోణీ కొట్టిన హైదరాబాద్ టీమ్

రంజీ ట్రోఫీలో హైదరాబాద్ జట్టు శుభారంభం చేసింది. టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ సారథ్యంలో బరిలోకి దిగిన హైదరాబాద్.. గ్రూప్-బి తొలి మ్యాచ్‌లో త్రిపురపై ఇన్నింగ్స్ 40 పరుగుల తేడాతో భారీ విజయాన్ని అందుకుంది. కేవలం మూడు రోజుల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ బౌలర్లు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన త్రిపుర, హైదరాబాద్ బౌలర్ల ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో 134 పరుగులకే కుప్పకూలింది. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ అనికేత్ రెడ్డి 5 వికెట్లతో చెలరేగగా, తనయ్ త్యాగరాజన్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన హైదరాబాద్, ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (54), రుతిక్ యాదవ్ (61), రాహుల్ రదేశ్ (40), చామ మిలింద్ (40) రాణించడంతో తొలి ఇన్నింగ్స్‌లో 294 పరుగులు చేసి కీలక ఆధిక్యాన్ని సంపాదించింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ త్రిపుర బ్యాటర్లు చేతులెత్తేశారు. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్ ఈసారి 6 వికెట్లతో త్రిపుర పతనాన్ని శాసించాడు. కెప్టెన్ సిరాజ్ రెండు కీలక వికెట్లు తీయడంతో త్రిపుర 120 పరుగులకే ఆలౌటైంది. దీంతో హైదరాబాద్ జట్టు ఇన్నింగ్స్ 40 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మ్యాచ్ మొత్తంలో 9 వికెట్లు తీసిన తనయ్ త్యాగరాజన్ హీరోగా నిలిచాడు.

# ప్రపంచకప్ జట్టులో కోహ్లీ, రోహిత్.. బీసీసీఐ రెండు కండిషన్లు

2027 వన్డే ప్రపంచకప్‌లో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఆడతారా? వయసు మీద పడుతున్న నేపథ్యంలో ఈ ఇద్దరు సీనియర్ల ఎంపికపై కొంతకాలంగా చర్చ సాగుతోంది. అయితే, వయసు ఒక్కటే ఆటగాడి ఎంపికకు ప్రాతిపదిక కాకూడదని బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ స్పష్టం చేశారు. ఫిట్‌నెస్, ప్రదర్శనే కీలకమని పేర్కొన్నారు. వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా ప్రపంచకప్ జరగనున్న విషయం తెలిసిందే.



### ఫిట్‌నెస్, ప్రదర్శనకే ప్రాధాన్యం

ప్రపంచకప్ జట్టు ఎంపికపై బీసీసీఐ నేరుగా వ్యాఖ్యానించలేదని మన్హాస్ తెలిపారు. తుది నిర్ణయం సెలెక్టర్లు, కోచ్‌లదేనని చెప్పారు. అయితే, తన అభిప్రాయం ప్రకారం ఆటగాడి ఫిట్‌నెస్, మైదానంలో ప్రదర్శనే ఎంపికకు ప్రామాణికాలని స్పష్టం చేశారు. జట్టు కోసం ఆడుతూ విజయాలు అందించే సత్తా ఉంటే వయసును అడ్డంకిగా చూడకూడదని అభిప్రాయపడ్డారు.

### గిల్‌కు సీనియర్ల అండ

వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు కోహ్లీ, రోహిత్, హార్దిక్ పాండ్యా వంటి అనుభవజ్ఞుల సహకారం ఎంతో ఉపయోగపడుతుందని మన్హాస్ అన్నారు. జస్ప్రీత్ బుమ్రా వంటి ఆటగాళ్లు బౌలింగ్ విభాగానికి నాయకత్వం వహించగలరని పేర్కొన్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ బాధ్యతలను సమర్థంగా పంచుకోవడం జట్టుకు మేలు చేస్తుందని చెప్పారు. ఒత్తిడిలో కీలక సందర్భాల్లో సత్తా చాటిన ఆటగాళ్లు జట్టులో ఉండటం మంచి కలయిక అని అభిప్రాయపడ్డారు.

### బౌలింగ్, ఫీల్డింగే కీలకం: కైఫ్

మాజీ భారత బ్యాటర్ మహమ్మద్ కైఫ్ సైతం ప్రపంచకప్‌పై తన అభిప్రాయాలను వెల్లడించారు. దక్షిణాఫ్రికాలో పిచ్‌లు గతంతో పోలిస్తే బ్యాటింగ్‌కు అనుకూలంగా మారాయని చెప్పారు. ఈ నేపథ్యంలో బౌలింగ్ విభాగం నాణ్యతే విజయాన్ని నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. భారత్ ప్రపంచకప్ గెలవాలంటే బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాలను పటిష్ఠం చేసుకోవాలని సూచించారు. కోహ్లీ, రోహిత్ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు.

# జైలు నుంచి వచ్చాక శతకం..

### మైదానంలోనే ఏడ్చేసిన బెంగాల్ క్రికెటర్!

తీవ్రమైన ఆరోపణలతో జైలుకు వెళ్లి, ఇటీవలే బెయిల్‌పై విడుదలైన బెంగాల్ వికెట్ కీపర్-బ్యాటర్ అభిషేక్ పోరెల్.. తిరిగి క్రికెట్ మైదానంలోకి అడుగుపెట్టి అద్భుత శతకంతో కదం తొక్కాడు. రంజీ ట్రోఫీలో భాగంగా ఢిల్లీతో జరుగుతున్న మ్యాచ్‌లో సెంచరీ పూర్తి చేసిన వెంటనే భావోద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకున్నాడు. మాటలతో కాకుండా తన ఆటతోనే సమాధానం చెప్పాలన్న తన పట్టుదలను ఈ సెంచరీతో చాటుకున్నాడు. కల్యాణి వేదికగా జరుగుతున్న ఈ సీజన్ తొలి మ్యాచ్‌లో బెంగాల్ తరఫున ఆడుతున్న 23 ఏళ్ల పోరెల్, రెండో రోజు ఆట ముగిసే సమయానికి 137 బంతుల్లో 114 పరుగులతో అజేయంగా నిలిచాడు. మరో ఎండ్‌లో సుదీప్ ఘరామి (122 నాటౌట్) కూడా శతకంతో రాణించడంతో వీరిద్దరి భాగస్వామ్యం జట్టుకు భారీ స్కోరు అందించింది. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో ఢిల్లీని 240 పరుగులకు ఆలౌట్ చేసిన బెంగాల్, రెండో రోజు ఆట ముగిసేసరికి 3 వికెట్ల నష్టానికి 304 పరుగులు చేసి కీలక ఆధిక్యం సంపాదించింది. తన కెరీర్‌లో ఇది రెండో ఫస్ట్-క్లాస్ సెంచరీ. ఈ మైలురాయిని అందుకున్న వెంటనే పోరెల్ మోకాళ్లపై కూర్చొని కన్నీటిపర్యంతమయ్యాడు. ఆ తర్వాత తేరుకుని, బ్యాట్ పైకెత్తి అభివాదం చేశాడు. ఈ ఘటన మైదానంలో ఉన్నవారిని కదిలించింది. ఆట అనంతరం పోరెల్ మాట్లాడుతూ.. ఆ భావోద్వేగం తనకు తెలియకుండానే వచ్చేసిందని చెప్పాడు. మాటలతో కాకుండా తన ఆటతోనే సమాధానం చెప్పాలనుకుంటున్నానని, ఈ సంబరం అందులో భాగమేనని వివరించాడు. ఈ కష్టకాలంలో తనకు మద్దతుగా నిలిచిన కోచ్ లక్ష్మీ రతన్ శుక్లాకు, ఇతరులకు కృతజ్ఞతలు తెలిపాడు. గత కొన్ని వారాలుగా పోరెల్ వ్యక్తిగత సమస్యలను ఎదుర్కొన్న విషయం తెలిసిందే. కర్ణాటకకు చెందిన ఓ మెడికల్ విద్యార్థిని పెళ్లి పేరుతో మోసం చేసి అత్యాచారం చేశాడని, బెదిరింపులకు పాల్పడ్డాడని ఆరోపించింది. ఈ ఫిర్యాదు మేరకు ఆగస్టు 11న పోలీసులు అతడిని అరెస్టు చేశారు. నెల రోజులకు పైగా జైలులో ఉన్న పోరెల్, సెప్టెంబర్‌లో చిన్సురా కోర్టు నుంచి బెయిల్ పొందాడు. అయితే, తనపై వచ్చిన ఆరోపణలను అతను ఖండించాడు. ఈ నేపథ్యంలోనే అతడిని రంజీ ట్రోఫీ ఆరంభ మ్యాచ్‌కు బెంగాల్ జట్టులోకి ఎంపిక చేశారు. ఈ విషయంపై స్పందించిన బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ (సీఏబీ), అతని వ్యక్తిగత, న్యాయపరమైన విషయాలతో తమకు సంబంధం లేదని, ప్రస్తుతం జట్టు ఎంపికలో అతడిని పరిగణనలోకి తీసుకున్నామని స్పష్టం చేసింది.

# హాట్ కేక్‌ల్లా వరల్డ్ కప్ 2027 టికెట్లు.. 12 రోజుల్లో కోటిన్నర దరఖాస్తులు!

2027లో జరగనున్న ఐసీసీ పురుషుల క్రికెట్ ప్రపంచకప్‌పై అభిమానుల్లో అప్పుడే అంచనాలు ఆకాశాన్నంటాయి. టోర్నీ ఆరంభానికి ఇంకా ఏడాదికి పైగా సమయం ఉన్నప్పటికీ, టికెట్ల కోసం ప్రపంచవ్యాప్తంగా అనూహ్య స్పందన లభిస్తోంది. టికెట్ బ్యాలెట్ ప్రక్రియ ప్రారంభమైన కేవలం 12 రోజుల్లోనే ఏకంగా 1.5 కోట్లకు పైగా దరఖాస్తులు రావడం క్రికెట్ అభిమానుల్లో నెలకొన్న ఉత్సాహానికి నిదర్శనంగా నిలుస్తోంది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు ఈ మెగా టోర్నీకి సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఐసీసీ వెల్లడించిన వివరాల ప్రకారం.. 142 దేశాల నుంచి అభిమానులు టికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు మొత్తం 1,50,83,752 టికెట్ దరఖాస్తులు రాగా, 44,23,417 బ్యాలెట్ రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైన మొదటి వారంలోనే 10 లక్షల దరఖాస్తులు రాగా, ఆ తర్వాత అనూహ్యంగా ఈ సంఖ్య పెరిగింది. దాదాపు 24 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈ మెగా టోర్నీ ఆఫ్రికా గడ్డపై జరగనుండటం విశేషం. అంతేకాకుండా, నూతన ఫార్మాట్‌లో జరగనున్న ఈ 14వ ఎడిషన్‌ను క్రికెట్ చరిత్రలోనే అతిపెద్ద ఈవెంట్‌గా నిర్వహించాలని నిర్వాహకులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ అనూహ్య స్పందనపై ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సంజోగ్ గుప్తా మాట్లాడారు. "ప్రపంచకప్ టోర్నీకి ఉన్న ప్రతిష్ఠ, ఆతిథ్య దేశాలుగా ఆఫ్రికా దేశాలకు ఉన్న ఆకర్షణ, టోర్నీకి ముందు ఐసీసీ చేపట్టిన ప్రచార కార్యక్రమాలే ఈ భారీ స్పందనకు కారణం. ఇది మాకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది" అని వివరించారు. టోర్నీకి ఇంకా ఏడాది సమయం ఉన్నందున, రానున్న రోజుల్లో 360 డిగ్రీల యాక్టివేషన్లు, వివిధ వేదికల ద్వారా ప్రచార కార్యక్రమాలతో అభిమానుల్లో ఉత్సాహాన్ని మరింత పెంచుతామని ఆయన తెలిపారు. అభిమానులు టికెట్ల బ్యాలెట్ కోసం రిజిస్టర్ చేసుకునేందుకు 2026 నవంబర్ 21 చివరి తేదీగా నిర్ణయించారు. సరిగ్గా ఏడాది తర్వాత అంటే 2027 నవంబర్ 21న జొహన్నెస్‌బర్గ్‌లోని వాండరర్స్ స్టేడియంలో ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ టోర్నమెంట్ 2027 అక్టోబర్ 2న నమీబియాలోని విండ్‌హోక్‌లో మూడు జట్ల సూపర్ సిరీస్‌తో ప్రారంభం కానుంది. మొత్తం మీద టోర్నీ ఆరంభానికి ముందే టికెట్లకు ఈ స్థాయిలో డిమాండ్ రావడం, ఈ మెగా ఈవెంట్‌పై ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆసక్తిని స్పష్టం చేస్తోంది.





# అందంతో కట్టిపడేస్తున్న బ్యూటీ!

టాలీవుడ్ బుట్టబొమ్మ పూజా హెగ్డే ఈరోజు తన 36వ పుట్టినరోజును ఎంతో వేడుకగా జరుపుకుంటున్నారు. టాలీవుడ్ నుంచి కోలీవుడ్, బాలీవుడ్ వరకు తన అందం, అద్భుతమైన డ్యాన్స్‌తో మిలియన్ల మంది అభిమానుల మనసులను గెలుచుకున్న ఈ భామకు సోషల్ మీడియా వేదికగా అభిమానులు, సినీ ప్రముఖులు శు భాకాంక్షలు తెలుపుతున్నారు. ఈ ప్రత్యేక సందర్భంగా పూజా హెగ్డే ఫ్యాషన్ లుక్స్, విశేషాలు ఇప్పుడు చూద్దాం.. బర్త్‌డే సందర్భంగా పూజా హెగ్డే షేర్ చేసిన గ్లామరస్ ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. సముద్రం బ్యాక్‌డ్రాప్‌లో బోట్ పై బ్లూ అండ్ వైట్ డ్రెస్సులో దిగిన పిక్స్, నిర్మూహ బ్రాండ్ బేబీ పింక్ గౌనులో మెరిసిన రాయల్ లుక్స్ అభిమానులను కట్టిపడేస్తున్నాయి. ఇక మినిమలిస్ట్ వైట్ బ్లౌజ్, క్లాసిక్ డెనిమ్ జీన్స్‌లో పూజ ఫ్యాషన్ శైలి 'బ్యూటీ ఇన్ సింప్లిసిటీ'కి పర్ఫెక్ట్ ఎగ్జాంపుల్‌గా నిలిచింది. దుల్కర్ సల్మాన్, వరుణ్ ధావన్ వంటి స్టార్ హీరోలు పూజా హెగ్డేకు ప్రత్యేకంగా బర్త్‌డే విషెస్ తెలిపారు. రాబోయే 'శ్రీ శ్రీ' చిత్రంలో కలిసి నటిస్తున్న దుల్కర్ సల్మాన్ శు భాకాంక్షలు తెలుపుతూ.. "పూజ కేవలం ఫన్ కో-యాక్టర్ మాత్రమే కాదు, ఒక గ్రేట్ గేమర్, ఆడియోఫైల్, కెమెరాలు, సినిమాలు, మ్యూజిక్ గురించి మాట్లాడే ఫెలో నెర్డ్" అని ప్రశంసించారు. ఇక బాలీవుడ్ హీరో వరుణ్ ధావన్ సరదాగా విషెస్ చెబుతూ తమ బాండింగ్‌ను పంచుకున్నారు.



# ఎంత ఎదిగినా కానీ... గుర్తు చేసుకుని మరీ రజనీ ఎమోషనల్!

స్కూల్ డేస్ అయినా, కెరీర్ తొలినాళ్లయినా.. ఆ రోజుల్లో ఉండే ఆనందం, తృప్తి జీవితంలో ఎంత పెద్ద స్థాయికి ఎదిగినా మళ్లీ దొరకవు. సూపర్‌స్టార్ రజినీకాంత్ తాజా వ్యాఖ్యలు దీనిని ప్రతి ఒక్కరికీ గుర్తు చేస్తాయి. ఇటీవల ఒక ఈవెంట్‌లో పాల్గొన్న రజనీకాంత్ మాట్లాడుతూ తన గతాన్ని తలచుకుని ఎంతో భావోద్వేగానికి గురయ్యారు. బెంగళూరులో బస్సు కండక్టర్‌గా పనిచేసిన రోజులు తనకెంతో సంతోషాన్నిచ్చాయని.. ఎంత పెద్ద స్టార్‌డమ్ వచ్చినా ఆ రోజుల్లో దక్కిన ఆనందమే వేరని ఆయన చెప్పిన మాటలు అందరినీ ఆలోచింపజేస్తున్నాయి. ఈవెంట్‌లో రజనీకాంత్ మాట్లాడుతూ.. ఐదేళ్ల పాటు బెంగళూరులో చేసిన బస్సు కండక్టర్ ఉద్యోగాన్ని ఇప్పటికీ మిస్ అవుతున్నానని వెల్లడించారు. సుమారు ఐదేళ్లపాటు ఆ ఉద్యోగం చేశానని.. ఆ సంతోషకరమైన రోజులను తాను జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేనని అన్నారు. అందుకే ఆ జ్ఞాపకాలను నెమరువేసుకునేందుకు ఇప్పటికీ తరచూ బెంగళూరుకు వెళ్తుంటానని తెలిపారు. అంతేకాకుండా.. తాను ఎంతటి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు సాధించినా... తనను తాను ఎప్పుడూ ఒక పెద్ద స్టార్‌గా భావించనని.. ఇప్పటికీ ఒక సాధారణ బస్సు కండక్టర్‌గానే అనుకుంటానని చెప్పుకొచ్చారు. ప్రతి ఒక్కరూ జీవితంలో పరిగెత్తి చాలా సంపాదించి ఉండొచ్చు.. డబ్బు – అపారమైన కీర్తి ప్రతిష్ఠలను ఆర్జించి ఉండొచ్చు. కానీ అవేవీ మనిషికి పూర్తి స్థాయి మానసిక ఆనందాన్ని, తృప్తిని అందించలేవనేది పచ్చి నిజం. మనిషి వయసుతో పాటు ఎదిగే క్రమంలో, పరిణతి చెందే క్రమంలో కొత్త బాధలు, కొత్త నష్టాలు– బాధ్యతల వల్ల కలిగే కష్టాలు కూడా పుట్టుకొస్తుంటాయి. ఇవి ఎంత డబ్బు ఉన్నా లొంగవు, అలాగే ఎంత కీర్తి ప్రతిష్ఠలు ఉన్నా ఆ మానసిక బాధలను నిలువరించలేవు.

# శంబాల టీమ్ నెక్స్ట్.. మరో గ్లామర్ టచ్




సినిమా స్టోరీతో పాటు క్యాస్టింగ్ సెలెక్షన్ పై కూడా ఇప్పుడు స్పెషల్ ఫోకస్ పెడుతున్నారు దర్శక నిర్మాతలు. మంచి ఛాన్సులు ఇస్తూ ఎంకరేజ్ చేస్తున్నారు. ఇప్పుడు యంగ్ హీరో సందీప్ కిషన్ నటిస్తున్న కరికాల సినిమాలోనూ ఇదే కనిపిస్తోంది. శంబాల సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు యుగంధర్ ముని తెరకెక్కిస్తున్న ఆ మూవీలో మరో హీరోయిన్ గా సాక్షి మడోల్కర్ ఫిక్స్ అయ్యారు. దీంతో సినిమాకు మరో టాలెంట్ అండ్ గ్లామర్ టచ్ తోడైనట్లు అయింది. శంబాల సినిమాతో ప్రేక్షకులను ఆకట్టుకున్న యుగంధర్ ముని.. ఇప్పుడు కరికాలతో మరోసారి తన టాలెంట్ చూపించేందుకు సిద్ధమవుతున్నారు. సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్న ఆ చిత్రాన్ని షైనింగ్ పిక్చర్స్ బ్యానర్ పై మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మిస్తున్నారు. భారీ ఖర్చుతో, కొత్త తరహా కథతో రూపొందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు సినిమాపై ఆడియన్స్ లో ఇంట్రెస్ట్ పెంచాయి. రీసెంట్ గా మూవీలో హీరోయిన్ గా కేథరిన్ థ్రెసా నటిస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. ఇప్పుడు సాక్షి మడోల్కర్ ను కూడా మరో హీరోయిన్ గా పరిచయం చేశారు. ఆమెకు వెల్కమ్ చెబుతూ పోస్టర్ విడుదల చేశారు. దీంతో కరికాలలో హీరోయిన్ల సెలక్షన్ ఇప్పుడు ఇంట్రెస్టింగ్ గా మారింది. సాక్షి మడోల్కర్ తెలుగు ప్రేక్షకులకు కొత్తేమీ కాదు. మోగ్లీ సినిమాతో ఆమె టాలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. తొలి సినిమాతోనే గుర్తింపు తెచ్చుకున్న ఆమెకు ఇప్పుడు వరుసగా కొత్త అవకాశాలు వస్తున్నాయి.



# వధువు లుక్‌లో సారా అలీఖాన్

బాలీవుడ్ అందాల తార సారా అలీ ఖాన్ ప్రస్తుతం తన స్టైలిష్ లుక్స్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. సెలబ్రిటీ డిజైనర్ గౌరవ్ గుప్తా రూపొందించిన 'ది బ్రైడ్ సైడ్' సీజన్ 7 కోసం ఆమె ఒక అద్భుతమైన ఫొటోషూట్‌లో పాల్గొన్నారు. గౌరవ్ గుప్తా సిగ్నేచర్ శైలి అయిన శిల్పకళా రూపాలు, సరికొత్త భారతీయ వధువు డిజైన్ల సమ్మేళనంతో కూడిన మూడు విభిన్న డ్రెస్ ల లో సారా మెరిసిపోయారు. ఆ విశేషాలు చూద్దాం. ఈ డిజిటల్ సిరీస్‌లో కేవలం దుస్తుల ప్రదర్శన మాత్రమే కాకుండా, సారా అలీ ఖాన్ వ్యక్తిత్వాన్ని సరికొత్త కోణంలో ఆవిష్కరించారు. ప్రముఖ స్టైలిస్ట్ అమీ పటేల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఇంటిమేట్ కాన్వర్జేషన్‌లో సారా తన మనసులోని మాటలను పంచుకున్నారు. ఇక క్రియేటివ్ డైరెక్టర్ గౌరవ్ గుప్తా యూనివర్స్‌లో వధువు యొక్క విభిన్న కోణాలను ఈ ఎపిసోడ్ ఎంతో అందంగా చూపించింది. అడ్రియన్ జాకబ్స్ మేకప్, ఆసిఫ్ అహ్మద్ హెయిర్ స్టైలింగ్ ఈ లుక్‌కు మరింత అందాన్ని తెచ్చాయి. సినీ ప్రయాణం : సైఫ్ అలీ ఖాన్, అమృతా సింగ్ ల కుమార్తె అయిన సారా, 2018లో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ సరసన వచ్చిన 'కేదార్‌నాథ్' సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. మొదటి సినిమాతోనే బెస్ట్ ఫిమేల్ డెబ్యూగా ఫిలింఫేర్ అవార్డును గెలుచుకున్నారు. ఇక అదే ఏడాది రణ్‌వీర్ సింగ్‌తో 'సింబా' చిత్రంలో అలరించారు. ఆ తర్వాత 'లవ్ ఆజ్ కల్, 'అత్రంగి రే', 'జరా హట్కే జరా బచ్కే','మర్డర్ ముబారక్', 'ఏ వతన్ మేరే వతన్', అలాగే 'స్కై ఫోర్స్', 'మెట్రో... ఇన్ దినో', వంటి ఎన్నో సూపర్ హిట్ చిత్రాలలో నటిస్తూ బాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్నారు.

Printed, Published and Owned by : GUNDAGONI LINGAIAH and Printed at MANASA PRINTERS, H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001 . and Published at Manasa Publication H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001. Editor: GUNDAGONI LINGAIAH RNI.No. TELTEL/2013/58044. Cell : 9848457689. gundagoni@gmail.com CEO: KANDHULA VENKATARAMANA